ప్రజాశక్తి

శుక్రవారం 29 సెప్టెంబర్ 2023 | 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల

ఎమ్మెల్యేల చరవాణులకు అర్జీలు

- పాదయాత్రలో గుర్తించిన సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి
- సిపిఎం జిల్లా కార్యదర్శి హనీఫ్

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

పాదయాత్ర సందర్భంగా జిల్లాలో గుర్తించిన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించి పరిష్కరించటానికి ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని ఎనిమిది మంది శాసనసభ్యుల చరవాణులకు అర్జీలు పంపారు. సిపిఎం సెప్టెంబర్ పది నుండి 23 వరకు జిల్లాలో పాదయాత్ర నిర్వహించిందన్నారు. పాదయాత్ర సందర్భంగా గుర్తించిన సమస్యలు, జిల్లా అభివృద్ధి, పెండింగ్ సమస్యలు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించి పరిష్కారం చేయటానికి జిల్లాలోని ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని విజ్ఞప్తి చేస్తూ.. సిపిఎం ప్రకాశం జిల్లా కమిటీ జిల్లాలోని ఎనిమిది మంది శాసనసభ్యుల చరవాణులకు అర్జీలను పంపించినట్లు హనీఫ్ తెలియజేశారు. అర్జీలోని సమస్యలను పరిష్కరించడానికి ప్రజాప్రతినిధులు కృషి చేయాలని కోరారు.



జవాన్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున

ప్రభుత్వ లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు

టిక్కెట్ల విషయంపై
పాలకపక్షంలో గందరగోళం

- సామాజిక సమతుల్యమే చిక్కుముడి
- ఎటూ తేల్చుకోలేకపోతున్న అధికార పార్టీ
- సిఎం సమీక్ష అనంతరం ప్రయత్నాలు ముమ్మరం
- తెలుగుదేశంలో అభ్యర్థులందరూ ఖరారు



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

తెలుగుదేశం పార్టీలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో అన్ని నియోజకవర్గాలకు అభ్యర్థులు దాదాపుగా ఖరారయ్యారు. దర్శి నియోజకవర్గం మినహాయిస్తే అన్నిచోట్లా ఇన్‌ఛార్జిలుగా ఉన్న వారికే టిక్కెట్లు ఖరారైనట్లే.. ఒకటీఅరా మార్పులు తప్ప పెద్దగా ఏమీ ఉండబోవన్నది సుస్పష్టం. అయితే పాలకపక్షంలో ఆ పరిస్థితి లేదు. అంతా గందరగోళంగానే ఉంది. పార్టీ సీనియర్ నేత బాలినేనికి తప్ప మిగతా నియోజకవర్గాల్లో ఎక్కడా కూడా పూర్తిస్థాయిలో స్పష్టత లేదు. ఎవరికి ఏస్థానం అదే దానిపై ఒకటీ రెండు నియోజకవర్గాల్లో మినహా మిగతాచోట్ల అస్పష్టంగానే ఉంది.

మంత్రి ఆదిమూలపు సురేష్ కూడా యర్రగొండపాలెంలోనే పోటీ చేస్తారా? అనేదీ తేల్లేదు. ఆయన స్థానం కూడా మరో నియోజకవర్గానికి మారవచ్చునే ప్రచారం వేగిరమైంది. టిక్కెట్ల వ్యవహారం అంతా నేరుగా సిఎం జగన్ పరిధిలోనే ఉంది. జిల్లా నేతల పాత్ర, కో ఆర్డినేటర్లుగా ఉన్న నేతల పాత్ర ఎంత ఉందనేదీ స్పష్టత లేదు. వీరి సిఫార్సులకు అసలు సిఎం జగన్ ప్రాధాన్యత ఇస్తారా? లేదా? అనేదీ చర్చ నడుస్తోంది. ప్రతి చిన్న విషయాన్నీ ఆయనే నేరుగా పర్యవేక్షిస్తున్నారు. మండలస్థాయి నేతల సస్పెండ్ విషయం కూడా ఆయన వద్ద నుంచే జరుగుతోంది. కనీసం జిల్లా నేతలను సంప్రదించే పరిస్థితి కూడా కనిపించడం లేదు. ఇక రెండ్రోజుల క్రితం ఆయన నిర్వహించిన ఎమ్మెల్యేల సమీక్ష అనంతరం పరిస్థితి మరింత అయోమయంగా ఉంది. 60 నుంచి 65 మందికి పైగా సిట్టింగులకు టిక్కెట్లు రావనే సంకేతాలు ఇవ్వడంతో అందరిలోనూ గుబులు పెరిగింది. తనకు గ్యారంటీగా టిక్కెట్టు వస్తుందని ధైర్యంగా చెప్పే ఎమ్మెల్యే గానీ, ఇన్‌ఛార్జి గానీ జిల్లాలో కనిపించడం లేదు. 'అంతా సిఎం దయ' అని చెబుతున్నారు. ఆఖరు నిమిషం వరకూ వేచి చూడాల్సిందే. ప్రస్తుతానికి ఎవరి పనిలో వారుండాలని ఆదేశించారు. గడపగడపకూ పూర్తిచేయాలని చెప్పారు. అయితే టిక్కెట్ల విషయం ఏమీ తేలకుండా తిరిగినా ఉపయోగం ఏమిటనే భావనలో కొందరు ఈ పాటికే వెళ్లిపోయారు. టిక్కెట్లపై మళ్లీ ధీమా లేని ఒకరిద్దరు ఎమ్మెల్యేలు ప్రత్యామ్నాయాలను వెతుక్కుంటున్నారు. ఇన్‌ఛార్జిల మార్పులు చేర్పులపైనా చర్చ సాగుతోంది. పర్చూరు ఇన్‌ఛార్జి మారతారనే చర్చ తెరపైకి వచ్చింది. అందుకు కీలక నేతలు మంతనాలు సాగిస్తున్నారు. దర్శి నుంచి బూచేపల్లికి గ్రీన్‌సిగ్నల్ వచ్చినట్లు తెలుస్తోంది. సిట్టింగ్ ఎమ్మెల్యేకు ఈ పాటికే ఓ స్పష్టత ఇచ్చినట్లు సమాచారం. ఆయన అక్కడే పోటీ

▶ 2లో

జిపిఎస్ జీవో ప్రతులు దహనం

- శాసనసభలో ఆమోదించడం దుర్గార్గపు చర్య
- సిపిఎస్ జిల్లా కన్వీనర్ షేక్ అబ్దుల్ హై



జిపిఎస్ జీవో ప్రతులు దహనం చేస్తున్న ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-పొదిలి

ఉద్యోగ, ఉపాధ్యాయ ఆకాంక్షలకు వ్యతిరేకంగా జిపిఎస్ బిల్లును శాసనసభలో ఆమోదించడం దుర్మార్గపు చర్య అని, ఇది సిపిఎస్ ఉద్యోగులకు చీకటి రోజు అని సిపిఎస్ జిల్లా కన్వీనర్ షేక్ అబ్దుల్ హై విమర్శించారు. స్థానిక యుటిఎఫ్ భవన్‌లో ముఖ్య కార్యకర్తలతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిపిఎస్ ప్రతులను దహనం చేశారు. సమావేశంలో అబ్దుల్ హై మాట్లాడుతూ సిఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల సమయంలో తాము అధికారంలోకి వస్తే కంట్రిబ్యూటరీ పెన్షను విధానాన్ని వారంలోపే రద్దు చేస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన మాట తప్పినట్లు తెలిపారు. నాలుగున్నరేళ్ల తర్వాత ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు భిన్నంగా శాసనసభలో జిపిఎస్ బిల్లును ఆమోదించి, ఉద్యోగులకు ఇచ్చిన హామీని శాసనసభ సాక్షిగా అపహాస్యం పాలు చేశారన్నారు. జిపిఎస్ బిల్లును ఆమోదించడం ద్వారా సిపిఎస్ ఉద్యోగుల ఆశలను రాష్ట్రప్రభుత్వం చిదిమేసిందని ఆరోపించారు. జిపిఎస్ వద్దని, పాత పెన్షను పునరుద్ధరించాలని ఉద్యోగ, ఉపాధ్యాయులు పోరాటాలు చేస్తున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా ఏకపక్షంగా జిపిఎస్ బిల్లును అసెంబ్లీలో ప్రవేశ పెట్టి ఆమోదించడం పట్ల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్యారెంటీ లేని పెన్షను స్కీమ్‌కు గ్యారెంటీ పెన్షను అని పేరు పెట్టడం ఉద్యోగ, ఉపాధ్యాయులను వంచించడమేనన్నారు. ఏ రాష్ట్రంలో లేని కొత్త విధానం, దేశానికే ఆదర్శం అని ప్రభుత్వం చెబుతోందన్నారు. ఉద్యోగి నుంచి కంట్రిబ్యూషన్ కట్టించుకొనే విధానం దేశానికే ఆదర్శం ఎలా అవుతుందని ఆయన ప్రశ్నించారు. ఇచ్చిన హామీని అమలు చేయకుండా, ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షలకు భిన్నంగా చర్యలు చేపడుతున్న ఈ ప్రభుత్వం తగు మూల్యం చెల్లించకోక తప్పదన్నారు. భవిష్యత్తులో జిపిఎస్ చట్టం రద్దు, పాతపెన్షను సాధించడం కోసం కలిసి వచ్చే ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలను కలుపుకొని పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో యుటిఎఫ్ కొనకనమిట్ల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బి.కపారావు, గోనె శ్రీనివాసులు, జిల్లా కౌన్సిలర్ పోలు శ్రీనివాస్‌రెడ్డి, కోనంకి సంజీవరావు, పాల్గొన్నారు.

బిల్లును ఆమోదించడం దారుణం

మార్టూరు రూరల్: పాత పెన్షన్ విధానం పునరుద్ధరించాలని ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఉద్యమాలు చేస్తున్న తరుణంలో శాసనసభలో మెజారిటీ ఎమ్మెల్యేలు

▶ 2లో

క్రెడిట్ కార్డు మోసాల పట్ల జాగ్రత్త

ఎస్‌పి మల్లికగర్గ్

అమర్నాథ్ హత్య కేసు నిందితుడి నుండి
రక్షణ కల్పించాలని ఫిర్యాదు

పోలీస్‌స్టేషన్‌లో కంప్లైంట్ ఇచ్చిన తల్లి మాధవి

ప్రజాశక్తి-చెరుకుపల్లి

తమ కుటుంబానికి రక్షణ కల్పించాలని, కేసు వాపసు తీసుకోకపోతే కుటుంబ సభ్యులందరినీ చంపేస్తానని బెదిరిస్తున్నట్లు ఉప్పాల అమర్నాథ్ తల్లి మాధవి గురువారం చెరుకుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఉప్పాల అమర్నాథ్‌ను పెట్రోల్ పోసి కాల్చి చంపిన కేసులో ప్రధాన నిందితుడు వెంకటేశ్వరరెడ్డి బెదిరిస్తున్నట్లు మాధవి ఆవేదన వ్యక్తం చేశారు. హత్య కేసులో ప్రధాన నిందితుడు పాము వెంకటేశ్వరరెడ్డి ఇటీవల బెయిల్‌పై విడుదల కాగా ఈ నెల 25న తమ పశువుల సావిడి దగ్గరకు వచ్చి 'నన్ను జైలుకు పంపిస్తారా.. మీ కుటుంబ సభ్యులందరినీ చంపేస్తా..' అని బెదిరించాడన్నారు. అదే రోజు రాత్రి తమ ఇంటికి వచ్చి తనను గొంతు పట్టుకోగా పెద్దగా అరవడంతో పారిపోయాడని చెప్పారు. నిందితుడి నుంచి తమ కుటుంబ సభ్యులందరికీ రక్షణ కల్పించాలని, ప్రధాన నిందితుడు వెంకటేశ్వరరెడ్డి బెయిల్‌ను తక్షణమే రద్దు చేయాలని కోరారు.



పోలీసులకు ఫిర్యాదు చేసిన మాధవి

పాలకపక్షంలో గందరగోళం

(మొదటిపేజీ తరువాయి)

చేసేందుకు టిక్కెట్టు కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరికి తిరిగి ఇవ్వాలి? ఎవరిని తప్పించాలి? స్థానాల మార్పులు ఎక్కడెక్కడ జరగాలి? అనేదానిపై ఐప్యాక్ టీము నివేదికలు ఆధారంగా సిఎం జగన్ పరిశీలన చేస్తున్నట్లు సమాచారం. అన్నిటికంటే కీలకమైన అంశం సామాజిక సమతుల్యత. గత ఎన్నికల్లో మాదిరిగా ఇక్కడ అన్ని సామాజికవర్గాలకు ప్రాధాన్యత ఇవ్వాలనే ఆలోచనలో తర్జనభర్జనలు కొనసాగుతున్నాయి. బీసీలకు కనిగిరి కేటాయించారు. ఇప్పుడు అనివార్యమని తెలుస్తోంది. ఆయనపై అసమ్మతి ఉన్నా బీసీలకు ప్రాధాన్యతల్లో ఇదే స్థానం కనిపిస్తోంది. దీంతో బుర్రా మధుసూధన్‌యాదవ్‌కు తథ్యమనే విశ్లేషణలున్నాయి. కాపు సామాజికవర్గానికి గతంలో దర్శి నుంచి ఇచ్చారు. ఈ సారి పర్చూరును కేటాయించే యోచనలో ఉన్నారు. ఉమ్మడి జిల్లాను పరిగణలోకి తీసుకునే అవకాశాలున్నాయి. వైశ్య సామాజికవర్గానికి గిద్దలూరులో రాంబాబుకు ఇచ్చారు. ఆయన అక్కడ రెండు సార్లు గెలిచారు. ఇదే సామాజికవర్గానికి జిల్లాలో తిరిగి టిక్కెట్టు ఇవ్వాలనే ఆలోచన గట్టిగా ఉంటే అన్నా రాంబాబుకు అక్కడ టిక్కెట్టు ఇవ్వక తప్పదు. దర్శి నుంచి శిద్దా రాఘవరావు తన కుమారుడికి టిక్కెట్టు ఆశిస్తున్నారు. వీరిద్దరిలో ఎవరికి ప్రాధాన్యత ఎలా ఎక్కడ ఇస్తారనేదీ చూడాలి. సంతనూతలపాడు, కొండపిలో అభ్యర్థులపైనే స్పష్టత లేదు. సంతనూతలపాడు ఎమ్మెల్యే సుధాకర్‌బాబు అనేక అంశాలపై వాగ్దాటిగా మాట్లాడే నేత కావడంతో ఆయనకు తిరిగి అక్కడే ఇవ్వాలా? లేక అసమ్మతులు తీవ్రంగా ఉన్నందున కొండపిలో ఇస్తే ఎలా ఉంటుందనే దానిపై చర్చ సాగుతోంది. కొండపిలో వరికూటి అశోక్‌బాబుకు అసమ్మతివర్గంగా డాక్టర్ వెంకయ్య గ్రూపు ఉంది. మరోవైపు ఇక్కడ జూపూడి ప్రభాకర్‌రావు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. కందుకూరులో తిరిగి మానుగుంట మహీధర్‌రెడ్డికి టిక్కెట్టు నూరుశాతం ఖరారైనట్లే. ఆయనకు పోటీగా ఎవరూ అక్కడ ప్రయత్నాల్లో లేరు. మార్కాపురంపైనా ఆఖరు నిమిషం వరకూ వేచిచూడాల్సిందే. అద్దంకిలో వైవీ అనుచరుడిగా ఉన్న హనిమిరెడ్డి పేరు తెరపైకి వచ్చింది. వైవీనే స్వయంగా ఈయన్ను ముందుకు తెచ్చారని సమాచారం. ఇన్‌ఛార్జిగా ఉన్న బాచిన చైతన్య పరిస్థితి ఏమినేదీ వేచిచూడాల్సిందే. చీరాలలో వైసిపి నుంచి కరణం వెంకటేశ్‌కు చాలా రోజుల క్రితమే అభ్యర్థిత్వం ఖరారైంది. పర్చూరుపై గందరగోళం కొనసాగుతోంది.

జిపిఎస్ జీవో ప్రతులు దహనం

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారనే కారణంతో ఉద్యోగ, ఉపాధ్యాయుల మనోభావాలు దెబ్బతినే విధంగా వైసిపి ప్రభుత్వం శాసనసభలో జిపిఎస్ బిల్లును ఆమోదించడం దారుణమని ఏపీ స్కూల్ అసిస్టెంట్స్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పూతలపట్టు నరోత్తంరెడ్డి, చింతల సుబ్బారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగి ఉద్యోగ విరమణ అనంతరం పెన్షన్ అందితేనే ధీమాగా ఉండగలమనే నమ్మకాన్ని ఈ ప్రభుత్వం వమ్ము చేసిందని విమర్శించారు. పాత పెన్షన్ విధానం అమలు చేయడం వల్ల రాబోయే 40 సంవత్సరాల తరువాత ప్రభుత్వాలపై పెనుభారం పడుతుందనే సాకుతో జిపిఎస్ విధానాన్ని అమలు పరచడం ఉద్యోగుల హక్కులను కాలరాయడమేనన్నారు. సిపిఎస్ రద్దు చేస్తామని ఆనాడు పాదయాత్రలో హామీ ఇచ్చిన నేటి ముఖ్యమంత్రి వాటిని వదిలేసి ఎవరికి ఉపయోగపడని గ్యారంటీ పెన్షన్ స్కీం ని తెరపైకి తెచ్చి ఉద్యోగులను దగా చేశారని ధ్వజమెత్తారు, ఇది పేరుకి మాత్రమే గ్యారెంటీ పెన్షన్ స్కీం కానీ.. ఇందులో పెన్షన్‌కి మాత్రం గ్యారంటీ లేదని పేర్కొన్నారు. కనీసం ప్రభుత్వ కాంట్రిబ్యూషన్ కూడా లేకుండా జిపిఎస్ బిల్లు ఆమోదించడం దారుణమని అన్నారు. దేశంలో అనేక రాష్ట్రాలు పాత పెన్షన్ విధానం పునరుద్ధరిస్తుంటే రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం కొత్తగా జిపిఎస్ విధానం అమలులోకి తెచ్చి.. ఉద్యోగ మరియు ఉపాధ్యాయుల సంక్షేమానికి గండి కొట్టే విధంగా చర్యలు తీసుకోవడం తగదని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి జిపిఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.

అస్తవ్యస్తంగా విద్యావ్యవస్థ

- ఉపాధ్యాయుల కొరతతో కుంటుపడుతున్న బోధన

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

మండలంలో విద్యా వ్యవస్థ పరిస్థితి అస్తవ్యస్తంగా తయారైంది. కొరత కారణంగా సర్దుబాటు పేరుతో ఉపాధ్యాయులకు ఇష్టారాజ్యంగా డ్యూటీలు వేస్తున్నారు. అనంతరం ఆ ఉపాధ్యాయులు తమ కేటాయించిన పాఠశాలకు వెళుతున్నారా లేదా అని పట్టించుకోవడం లేదు. దీంతో ఏ పాఠశాలలో ఏ ఉపాధ్యాయుడు విధులు నిర్వహిస్తున్నాడో అర్థం కాని పరిస్థితి నెలకొంది. విద్యాశాఖ అధికారులు అవకతవకలకు పాల్పడుతుండటంతో విద్యాబోధన కుంటుపడింది. సిఎస్‌పురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇప్పటికే గణితం, పిఎస్, బిఎస్ ఉపాధ్యాయ పోస్టులలో సరిపడా సిబ్బంది లేరు. అయినప్పటికీ ఆ పాఠశాల నుంచి ఎస్ఎ తెలుగు, ఎస్ఎ హిందీ, ఎస్ఎ సోషల్ సబెక్టు ఉపాధ్యాయులను ఇతర పాఠశాలలకు కేటాయించారు. పిల్లిపల్లి ప్రాథమిక



పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. అందులో ఒకరు స్టడీ లీవ్ ఉన్నారు. మరొకరిని కోవిలంపాడు ప్రాథమికొన్నత పాఠశాలకు పంపారు. పిల్లిపల్లిలో వాలంటీర్ ను ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయుల స్థానంలో వాలంటీర్ ను ఏర్పాటు చేయడంపై అభ్యంతరాలు వ్యక్తం కావడంతో ముండ్లపాడు ప్రాథమిక పాఠశాల నుంచి ఓ ఉపాధ్యాయురాలిని పిల్లిపల్లికి సర్దుబాటు చేశారు. పిల్లిపల్లి పాఠశాలలో ఉండాల్సిన ఉపాధ్యాయురాలిని ఉపాధ్యాయుల అవసరమే లేని కోవిలంపాడ కు పంపారు. ముండ్లపాడు ఉపాధ్యాయు రాలిని పిల్లిపల్లికి కేటాయించడంలో మర్మమేమిటో విద్యాశాఖ అధికారులకే తెలియాలి. అదేవిధంగా ఏకునాపురం స్పెషల్ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండగాఒ ఉపాధ్యాయుడిని తుంగూడు ప్రాథమిక పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపారు. ఆయన స్థానంలో గుంతచెన్నంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల నుంచిఓ ఉపాధ్యాయుడికి ఏకునాంపురం స్పెషల్ పాఠశాలకు డిప్యూటేషన్ వేశారు. ఏకునాంపురం జనరల్ ప్రాథమిక పాఠశాల నుంచి ఓ ఎంటిఎస్ ఉపాధ్యాయుడికి సిఎస్‌పురం వడ్డిపాలెం ప్రాథమిక పాఠశాలకు డిప్యూటేషన్‌పై పంపారు. రెండు తరగతులు మాత్రమే ఉన్న వడ్డెపాలెం ప్రాథమిక పాఠశాలలో ఇప్పటికే ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు. డిప్యూటేషన్‌పై మూడో ఉపాధ్యాయుడి కేటాయించడం విశేషం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అదనంగా ఉన్న ఉపాధ్యాయులకు మాత్రమే పని సర్దుబాటు చేయాల్సి ఉంది. సిఎస్‌పురం మెయిన్ ప్రాథమిక పాఠశాల, ఆర్కేపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలలో ఒక్కొక్క ఉపాధ్యాయుడు అదనంగా ఉన్నా ఆ పాఠశాలల నుంచి ఒక్కరిని కూడా ఇతర పాఠశాలకు డిప్యూటేషన్ వేయకపోవడం గమనార్హం.

గిద్దలూరులో రాజకీయ క్రీడ ప్రారంభం

ప్రజాశక్తి- గిద్దలూరు రూరల్

మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు తర్వాత గిద్దలూరు నియోజకవర్గంలో రాజకీయ క్రీడ మొదలైంది.రాష్ట్రం లోనే ప్రథమంగా వైసిపి నుంచి టిడిపిలోకి భారీ స్థాయిలో చేరికలు జరిగాయి. ఇటీవల గిద్దలూరులో నియోజక వర్గ స్థాయిలో టిడిపి కార్యకర్తలు విస్తృత స్థాయి సమావేశం, సభ నిర్వహించారు. సభలో గిద్దలూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి ముత్తుముల అశోక్ రెడ్డి మాట్లా డుతూ ఇది ఆరంభం మాత్రమే ఇక వరుసగా టిడిపి లోకి చేరికలు ఉంటాయని ప్రక టించారు. ఉమ్మడి జిల్లా టిడిపి నాయకత్వం గిద్దలూరు వేదికగా సమర శంఖారావం పూరించింది. గిద్దలూరు ప్రస్తుత ఎమ్మెల్యే అనావెంకట రాంబాబు ఐదేళ్ల క్రితం టిడిపి వీడుతున్నట్లు ఎక్కడ ప్రకటించారో అదే ప్రాంతంలో టిడిపి నాయకులు సభ నిర్వ హించి ఎన్నికల శంఖారావం పూరించారు. ఆ వేదికపై అశోక్ రెడ్డి మాట్లాడుతూ టిడిపి ప్రభుత్వం హయాంలో గిద్దలూరు ప్రాంతం మంచినీళ్ల కోసం మంజూరు చేసిన రూ. 500 కోట్లు ఎందుకు వైసిపి ప్రభుత్వం రద్దు చేసిందో చెప్పాలని సవాల్ విసిరారు. టిడిపి నాయకులు ఊహించనిదానికంటే జనం భారీగా జనం తరలివచ్చారు. సభా స్థలం నుంచి అటూ ఇటూ కిలోమీటర్ దూరం మేర భారీగా పోలీసులు మొహరించారు. ఇద్దరు డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐల సహా దాదాపు 300 మంది పోలీసులు బందోబస్తు నిర్వహించారు. గిద్దలూరు చరిత్రలో ఓ ప్రతిపక్ష పార్టీ సభకు ఇంత పెద్ద ఎత్తున బందోబస్తు నిర్వహించడం ఇదే మొదటిసారి అని ప్రజలు చెప్పు కుంటున్నారు. టిడిపి కార్యకర్తల విస్తృత స్థాయి, సమావేశ సభ నిర్వహించిన మరుసటి రోజే వైసిపి మండల నాయకులు సమావేశమే విలేకర్ల సమావేశం నిర్వహించారు. బీసీలందరూ వైసిపి వెంటే ఉన్నారని, జగనన్న ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచు కోవాలని, పదవుల కోసం ఇతర పార్టీలను ఆశ్రయించడం సమంజమని కాదని తెలిపారు. కొంత మంది పార్టీని వీడటం వల్ల పార్టీం నష్టం లేదని, పార్టీని వీడినవారు తమ పదవులకు రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు.

అమర్‌నాథ్ కుటుంబ సభ్యులకు రక్షణ కల్పించాలి

జై గౌడ్ ఉద్యమ రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబొమ్మ కిషోర్‌గౌడ్

ప్రజాశక్తి-చెరుకుపల్లి

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సష్టించిన పదవ తరగతి విద్యార్థి ఉప్పాల అమర్‌నాథ్ కుటుంబ సభ్యులకు రాష్ట్ర ప్రభుత్వం రక్షణ కల్పించాలని జై గౌడు ఉద్యమ రాష్ట్ర అధ్యక్షుడు చిట్టిబొమ్మ కిషోర్‌గౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. విద్యార్థి అమర్‌నాథ్‌ను అత్యంత ఆశవికంగా హత్య చేసిన ప్రధాన నిందితుడు పాము వెంకటేశ్వర రెడ్డి మృతుడి ఇంటికి వచ్చి కేసు వాపసు తీసుకోకపోతే కుటుంబ సభ్యులందరినీ చంపుతామని బెదిరించడం అత్యంత హేయమైన చర్య అని ఆయన విమర్శించారు. హత్య కేసులో ప్రధాన నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగే వరకూ జై గౌడ్ ఉద్యమ సంఘం పోరాటం చేస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు గౌడ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కిషోర్ గౌడ్

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు

ఐదుగురికి తీవ్ర గాయాలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ జాతీయ రహదారి పరిధిలోని మూలగుంటపాడు పోలేరమ్మ గుడి సమీపంలో ఉన్న రన్‌వే మీద ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను కారు ఢీకొన్న ఘటనలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన గురువారం జరిగింది. జీవన్‌కుమార్, సుకన్య, వెంకటేష్, మల్లికార్జున, నీరజ వైజాగ్ నుంచి చిత్తూరు కారులో వెళ్తుండగా ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను కారు ఢీ కొట్టింది. దీంతో కారులో ఉన్న ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. కారు నడుపుతున్న జీవన్‌కుమార్, ముందు కూర్చున్న సుకన్యలకు తీవ్ర గాయాలయ్యాయి. ఐదుగురిని హైవే అంబులెన్స్ ద్వారా ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. విషయం తెలుసుకొని ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. సిఐ దాచేపల్లి రంగనాథ్, ఎస్ఐ టి.శ్రీరామ్, ఏఎస్ఐ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మాయమైన ఇసుక ట్రాక్టర్

జాతీయ రహదారి పరిధిలోని రన్‌వే మీద కారు ఢీకొట్టిన ట్రాక్టర్ మాయమైపోయింది. ప్రమాదం జరిగిన వెంటనే గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తున్న సమయంలో ట్రాక్టర్ అక్కడి నుంచి వెళ్లిపోవడం చర్చనీయాంశంగా మారింది. జరుగుమల్లి మండలం నందనవనం ప్రాంతం నుంచి ట్రాక్టర్ ఇసుకను తీసుకొని శింగరాయకొండకు వస్తుండగా జాతీయ రహదారి మీద వెళుతున్న సమయంలో కారు వచ్చి ఆ ట్రాక్టర్‌ను వెనకవైపున ఢీకొట్టింది. ఆ సమయంలో ట్రాక్టర్లో ఇసుక ఉండటంతో ఆ ఇసుక్కు ఎలాంటి అనుమతులు లేవని తెలుసుకున్న డ్రైవరు పోలీసుల చేతికి చిక్కకుండా అక్కడ నుంచి మాయమైపోయాడు. ప్రమాదం జరిగినప్పుడు పోలీసులు ప్రమాదాల కారణమైన రెండు వాహనాలను పోలీస్ స్టేషన్‌కు తరలించాల్సి ఉండగా ఇసుక ట్రాక్టర్ అధికార పార్టీ నేతలకు చెందిందని ఆ ట్రాక్టర్‌ను అక్కడ నుంచి తప్పించినట్లు తెలుస్తోంది. అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లు జాతీయ రహదారితో పాటు గ్రామాల్లో కూడా అతివేగంగా వెళ్లటం ప్రమాదాలకు దారితీస్తున్నది. ఇలాంటి సమయంలో ఎలాంటి చిక్కులు వస్తాయోనని ఇసుక ట్రాక్టర్ అక్కడి నుంచి మాయమై పోయినప్పటికీ పోలీసులు దానిపై దృష్టి పెట్టకపోవడం కూడా చర్చగా మారింది.



ప్రమాద స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు



బిర్యానీలో పడి ఉన్న జెర్రి

బిర్యానీలో జెర్రి

ప్రజాశక్తి-బేస్తవారిపేట

స్థానిక బేస్తవారిపేట జంక్షన్ వద్ద సత్య మ్యాక్స్ ఫ్యామిలీ రెస్టారెంట్‌లో ఓ బిర్యాని ప్రియుడు బిర్యానీ తిందామని ఆ రెస్టారెంట్‌కి వెళ్ళాడు. సగం బిర్యానీ తిన్న తర్వాత గాని తెలియలేదు అందులో జెర్రి ఉన్నదని, ఆ జర్రిని చూసి ఒక్కసారిగా అవాక్కయ్యాడు. వెంటనే రెస్టారెంట్ యజమానికి తెలియపరచగా ఆ యజమాని కూడా అవాక్కయ్యాడు.

ఖోఖో జట్లు ఎంపిక

ప్రజాశక్తి - పంగులూరు

అక్టోబర్ 20నుండి 22వరకు చిత్తూరు జిల్లా యాదమరి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో జరిగే రాష్ట్రస్థాయి బాల, బాలికల ఖోఖో పోటీలలో పాల్గొనే ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు ఎంపిక ఈనెల 29న శుక్రవారం పంగులూరు ఎమ్మెస్సార్ అండ్ బిఎన్ఎం జూనియర్ కళాశాలలో జరుగుతుందని ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ కె వనజ, ఖోఖో రాష్ట్ర కార్యదర్శి సీతారాంరెడ్డి, జూనియర్ కళాశాలల సెక్రెటరీ ఆదినారాయణ గురువారం తెలిపారు. ఉమ్మడి ప్రకాశం జిల్లా స్కూల్ గేమ్స్ ఖోఖో క్రీడా పోటీలు, సెలక్షన్స్ అండర్ -17 బాలుర, బాలికలు అండర్ -19 బాలురు, అండర్ - 18 బాలుర జట్లు ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతాయని చెప్పారు. జట్టు ఎంపిక పంగులూరు ఎమ్మెస్సార్ అండ్ బిఎన్ఎం జూనియర్ కాలేజీలో, కంచర్లవారిపల్లి జెడ్‌పి ఉన్నత పాఠశాలలో జరుగుతాయని ప్రకాశం జిల్లా ప్రెసిడెంట్ కార్యదర్శి కె భాస్కరరావు, బి కాశీవిశ్వనాధరెడ్డి చెప్పారు. ఎంపికకు హాజరయ్యే క్రీడాకారులు ఎత్తు, బరువు, వయసు మొత్తం 250పాయింట్లలోపు ఉండాలని తెలిపారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన

ప్రజాశక్తి-పిసిపల్లి

రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఎస్ఐ కె.మధుసూదన్‌రావు గురువారం పిసిపల్లి ప్రభుత్వ వైద్యశాల సెంటర్‌లో వాహనచోదకులకు అవగాహన కల్పించారు. వాహన యజమానులతో పాటు సాధారణ ప్రజలకు కూడా అవగాహన కల్పించారు. ఎదురుగా వాహనాలు వచ్చే సమయంలో ముందస్తుగా తీసుకోవల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వలనే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. మద్యం తాగి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపవద్దన్నారు. ఇటీవల నెల రోజుల్లో పిసిపల్లి మండలంలో నాలుగు చోట్ల ప్రమాదాలు జరిగి ముగ్గురు చనిపోగా మరొకరు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారన్నారు. ప్రమాదాలు జరిగిన ప్రదేశాలను పరిశీలిస్తే డ్రైవర్లకు అవగాహన లేకపోవడం, మద్యం సేవించి వాహనాలను నడపడం వలన ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కర్ర లోడుతో వెళ్ళే ట్రాక్టర్లు కూడా ఎదురుగా వచ్చే వాహనాలు గుర్తించే విధంగా లైట్లు ఆర్పుతూ వేస్తుండాలని సూచనలు ఇచ్చారు. ఈ విధంగా గత వారం రోజులుగా మండలంలోని పెదఇర్లపాడు, పెదఅలవలపాడు తదితర ప్రాంతాల్లో అవగాహన కల్పించినట్లు తెలిపారు.

మానవతావాది జాషువా..

నరసం గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులోని హౌసింగ్ బోర్డు కాలనీలో నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం కార్యాలయంలో నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 128వ జయంతి కార్యక్రమాన్ని నరసం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జరిగిన సభకు నరసం జిల్లా అధ్యక్షురాలు డా.మున్నంగి రాజకుమారి అధ్యక్షత వహించగా సంస్థ గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సమతా,మమతల,మానవతా వాది అయిన జాషువా ఆధునికాంధ్ర సాహిత్య రంగంలో తొలితరం కవుల్లో అగ్రగణ్యులని తెలిపారు. ఆంధ్ర సాహితీ ప్రియుల హృదయాల్లో చెరగని ముద్ర వేశారని కొనియాడారు. తదనంతరం ప్రముఖ సాహితీవేత్త, కళామిత్రమండలి(తెలుగు లోగిలి) సంస్థ జాతీయ అధ్యక్షుడు డా.నూనె అంకమ్మరావు మాట్లాడుతూ అంటరానితనంతో అవమానాలను, ఆత్మక్షోభలను ఎదుర్కొన్న జాషువా హృదయం సంఘసంస్కరణ దక్పథాన్ని కోరుకున్నదని, సాంఘిక విప్లవం రావాలని, సంఘంలో దురాచారాలు సమసిపోయి అందరూ సహజీవనం చేయాలని సంకల్పించారని చెప్పారు. తెలుగుతనం గుబాళించే చక్కటి పదాల పోహళింపు, పదచిత్రాల మేళవింపు ఆయన కవిత్వానికి వన్నె తెచ్చాయని తెలిపారు. శ్రీకష్ణ దేవరాయ సాహిత్య సాంస్కృతిక సేవా సమతి అధ్యక్షుడు కుర్రా ప్రసాద్‌బాబు ప్రసంగిస్తూ జాషువా కవిగా రాణిస్తూనే అనేక విశిష్టమైన రచనలు చేశారని, ఎన్నో బిరుదులను, సన్మానాలను, పదవులను అందుకున్నాడని, శాసనమండలి సభ్యులుగా విశిష్ట గౌరవాన్ని పొందారని పేర్కొన్నారు. కార్యక్రమంలో యు.వి.రత్నం, అంగలకుర్తి ప్రసాద్, ధేనువకొండ సుబ్బారావు, కత్తి కపావరం, బీరం అరుణ, సుశీల పాల్గొన్నారు.



జాషువా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కలగానే మిగిలిన జలకళ



జలకళ వాహనం

ప్రజాశక్తి- త్రిపురాంతకం

నవరత్నాల్లో భాగంగా పేద రైతులకు ఉచితంగా బోరు బావులు తవ్విస్తామని చెప్పిన ప్రభుత్వం 2020 సంవత్సరంలో ప్రచార ఆర్భాటాలతో మొదలుపెట్టి మూడు సంవత్సరాలు అవుతున్న రైతుల ఆశలు అడియాసయ్యాయి. త్రిపురాంతకం మండలంలో జలకళ పథకం లో 310 బోర్లు వేయగా అందులో 22 మోటర్లు అందించడం జరిగింది. దీని విషయంపై యర్రగొండపాలెం ఏపీడిని భాస్కరరావును వివరణ కోరగా పాత దరఖాస్తులను పరిశీలించి 100 మీటర్లు దూరంలో ఉన్న విద్యుత్ కనెక్షన్ అందించే విధంగా బోరు పాయింట్ల అప్రూవల్ చేసిన వాటిని బోర్లు వేయించే విధంగా చూస్తున్నామని ఆయన తెలిపారు. సంవత్సరం గడుస్తున్న అప్పటి నుండి ఇప్పటివరకు దాని గురించి పట్టించుకున్నటువంటి నాయకుడు గాని అధికారులు గాని లేరని మండలంలోని రైతులు వాపోతున్నారు. బోరుబావి కూడా విద్యుత్ కలెక్షన్ బోర్ మోటార్ బిగించలేదని రైతులు తమ ఆవేదనను వ్యక్తం చేస్తున్నారు. మొదట చెప్పిన విధంగా కాకుండా 200 అడుగుల లోతు, రెండు విద్యుత్ స్తంభాల వరకు మాత్రమే అని చెప్పడంతో విద్యుత్ శాఖ అధికారులు తమ పని కాదని చేతులెత్తేశారు దీంతో మండలంలోని రైతులు మూడు ఖరీఫ్ పంటలను పోగొట్టుకోవడమే కాకుండా చేడిపోయినటువంటి బోరు బావుల్లో ప్రమాదం జరుగుతదేమో అని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ప్రభుత్వం రైతు ప్రభుత్వంగా ఉందని రైతుల పట్ల చెప్పినటువంటి ఏ ఒక్కటి నెరవేర్చడం లేదని ప్రభుత్వ రాయల్ తీర్చే అందవలసినటువంటి వాటిని అధిక తగలకు విక్రయిస్తున్న నోరు మెదపడం లేదని రైతులు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు ఇప్పటికైనా సంబంధిత అధికారులు నాయకులు చొరవ తీసుకొని జలకళను రైతుల పాలిట వరంగా మార్చాలని మండల రైతులు కోరుకుంటున్నారు.



తలకు గాయాలైన కోటమ్మ

ఆటో బోల్తా ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-కొండపి

ఆటో బోల్తా పడి పలువురికి తీవ్రగాయాలయిన సంఘటన కొండపి మండలం పెరిదేపి-మిట్టపాలెం గ్రామాల మలుపు వద్ద గురువారం జరిగింది. కొండపి పంచాయతీ పరిధిలోని ముక్కోడిపాలెం గ్రామానికి చెందిన మహిళా కూలీలు చోడవరం గ్రామంలో ఉన్న పొగనారు మడుల వద్దకు కూలి పనుల కోసం వెళుతుంటారు. రోజులాగానే గురువారం కూడా ముక్కోడిపాలెం గ్రామానికి పనులకు వెళ్లారు. పనులు అనంతరం తిరిగి వస్తున్న క్రమంలో మిట్టపాలెం-పెరిదేపి గ్రామాల మధ్య ఉన్న మలుపు వద్ద ఆటో అదుపు తప్పి బోల్తాపడింది. ఆటోలో 14 మంది మహిళా కూలీలు ఉన్నారు. కూలీలు అంజమ్మకు కాళ్లకు, కోటమ్మకు తలకు గాయాలు కాగా మిగిలిన వారికి స్వల్ప గాయాలయ్యాయి. అటువైపు వెళుతున్న వాహనదారులు గమనించి వెంటనే 108కి సమాచారం అందించారు. క్షతగాత్రులను రెండు దఫాలుగా కొండపి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకొచ్చారు. ఆసుపత్రిలో అందరికీ ప్రథమ చికిత్స చేశారు. అందులో తీవ్రగాయాలైన ముగ్గురిని ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.



భర్తను భార్యకు అప్పగిస్తున్న పోలీసులు

మతిస్థిమితం లేని వ్యక్తి కుటుంబం చెంతకు

శింగరాయకొండ : మార్బుల్స్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కార్మికుడు మతిస్థిమితం కోల్పోయి ఊళ్లు పట్టుకొని రాష్ట్రాలు దాటి రాగా గుర్తించిన శింగరాయకొండ పోలీసులు అతడిని తన భార్యకు అప్పగించిన సంఘటన గురువారం జరిగింది. శింగరాయకొండ పోలీసు అతనితో మాట్లాడి నెంబరును సేకరించారు. తీరా చూస్తే జార్ఖండ్ పోలీసులు ఫోన్ ఎత్తారు. జార్ఖండ్ పోలీసులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన సంజయ్ బిస్‌శర్మ తప్పిపోయి శింగరాయకొండకు రాగా ఏఎస్ఐ మహబూబ్‌బాషా, హెడ్ కానిస్టేబుల్ షాకీర్ బాషా వివరాలు తెలుసుకొని ఎస్ఐ టి.శ్రీరామ్‌కు తెలియపరిచారు. జార్ఖండ్ నుంచి సదరు వ్యక్తి బంధువులు రావడంతో వారికి అప్పగించారు. పోలీసులు చూపిన మానవత్వానికి బంధువులతో అతని భార్య దేవి కృతజ్ఞతలు తెలిపారు.



బెల్లపు ఊటతో పోలసులు

900 లీటర్ల బెల్లపు ఊట ధ్వంసం

నిజాంపట్నం : నాటు సారా తయారీకి ఉపయోగించే బెల్లపు ఊటను ధ్వంసం చేశామని నగరం స్పెషల్ ఎన్ఫోర్స్మెంట్ బ్యూరో సీఐ దేవర శ్రీనివాస్ తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ సెబ్ బాపట్ల అడిషనల్ ఎస్పీ ఆదేశాల మేరకు నిజాంపట్నం మండలంలోని అదవల గ్రామ శివారులోని మడ అడవుల్లో, సముద్ర తీర ప్రాంతంలో దాడులు నిర్వహించామని చెప్పారు. ఆ ప్రాంతాల్లో నాటు సారా తయారీకి ఉపయోగించేందుకు నిల్వ ఉంచిన 900 లీటర్ల బెల్లం ఊటను గుర్తించి అక్కడికక్కడే ధ్వంసం చేశామన్నారు...ఈ దాడిలో నగరం సబ్ సిబ్బంది పాల్గొన్నారు.

జాషువా సాహిత్యం సమాజానికి దిక్సూచి

ప్రజాశక్తి - చీరాల

జాషువా సాహిత్యం సమాజానికి దిక్సూచి అని, ఆయన సాహిత్యాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలని మౌలానా ఆజాద్, నేషనల్ ఉర్దూ యూనివర్సిటీ హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్ డాక్టర్ జివి రత్నాకర్ అన్నారు. నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా 128వ జయంతి సభ జాషువా సాహితీ సమితి, యుటిఎఫ్, కెవిపిఎస్, జెవివి, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఎన్జీవో భవనంలో కెవిపిఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు లింగం జయరాజు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సభలో డాక్టర్ రత్నాకర్ మాట్లాడుతూ సమాజంలోని అనేక రుగ్మతలను జాషువా తన సాహిత్యం ద్వారా ఎలుగెత్తారని అన్నారు. అనేక విశ్వవిద్యాలయాలలో జాషువా సాహిత్యంపైన పరిశోధనలు జరుగుతున్నాయని అన్నారు. జాషువా నాడు కుల పీడన గురించి రచనలు చేసినాడని అన్నారు. అభివృద్ధిలో దూసుకుపోతున్న తరుణంలో కూడా



ముసి కథ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ జివి రత్నాకర్

కులం గురించి మాట్లాడుకోవాల్సి రావడం, కులం పేరుతో దాడులు జరగడం చాలా విచారకరమని అన్నారు. జాషువా తన జీవిత చరమాంకం వరకు పీడిత ప్రజల పక్షాన తన రచనలను కొనసాగించారని అన్నారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ శరత్ చంద్ర మాట్లాడుతూ ప్రజలను చీల్చి లబ్ధి పొందాలనుకునేవారు కులం, మతం, ప్రాంతం పేరుతో విడదీస్తారని జాషువా ఆనాడే పేర్కొన్నారని అన్నారు. నేటి రాజకీయాలు వాటిని తలపిస్తున్నాయని అన్నారు. తన తండ్రి లుకా మాస్టర్ కడవరకు జాషువా సాహిత్యాన్ని ప్రజలకు చేరువ చేయడానికి కృషి చేశారని అన్నారు. ఆ స్ఫూర్తిని తాను కొనసాగిస్తానని తెలిపారు. కవితా విమర్శకులు పి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ జాషువా తన సాహిత్యం ద్వారా ప్రజల్లో నిలిచి ఉంటారని అన్నారు. అనంతరం డాక్టర్ రత్నాకర్ రచించిన ముసి కథ పుస్తక ఆవిష్కరణ చేశారు. యుటిఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు బండి భిక్షాలుబాబు, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్‌జె చిరంజీవి, ప్రజాసంఘాల నాయకులు నుకతోటి బాబురావు, ఏసోబు, గుమ్మడి ఏసురత్నం, వివిధ కవులు సిహెచ్ వెంకట్, పాపారావు పలువురు మాట్లాడారు. జాషువా పద్యాలను అలరించారు. కార్యక్రమంలో సీపీఎం కార్యదర్శి నలతోటి బాబురావు, ఎం వసంతరావు, భగవాన్, డేవిడ్, పి కిరణ్ పాల్గొన్నారు.

గ్లోబల్ టీచర్ ప్రైజ్ రేసులో ఐలవరం ఉపాధ్యాయుడు

ప్రజాశక్తి - బట్టిప్రోలు



ఉపాధ్యాయుడు హరికృష్ణ

యునెస్కోతో కలిపి ఆర్కే ఫౌండేషన్ ప్రపంచవ్యాప్తంగా అందించబడే గ్లోబల్ టీచర్ ప్రైజ్ రేసులో ఐలవరం జెడ్‌పి ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయులు పచ్చారు హరికృష్ణ ఉన్నారు. మారుమూల గ్రామాలు, పట్టణాల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని, విశ్వాసాన్ని పెంపొందిస్తూ మార్పు కోసం కృషి చేస్తున్న ఛాంపియన్లను గ్లోబల్ టీచర్ ప్రైజ్‌కు ఎంపిక చేస్తుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఆయా ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయుల పనితీరును ప్రామాణికంగా తీసుకొని చేపట్టిన సర్వేలో ఇప్పటికే 50మందిని ఎంపిక చేశారు. ఆ 50మందిలో ఎపి నుండి బాపట్ల జిల్లా భట్టిప్రోలు మండలం ఐలవరం జెడ్‌పి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు ఉండటం అభినందనీయం. కాగా ఈ 50మందిలో మరో పదిమందితో మెరిట్ లిస్టు ఎంపిక చేసి దానిలో ఒకరిని మాత్రమే ఎంపిక చేసి ప్రైజ్ మనీగా రూ.7.35కోట్లు అందజేస్తారు. ఈ రేసులో ప్రపంచవ్యాప్తంగా వచ్చిన వేలాది దరఖాస్తుల్లో ఎంపిక ప్రక్రియ అనంతరం టాప్ 50లో ఐలవరం ఆంగ్ల ఉపాధ్యాయులు హరికృష్ణ ఉండటం విశేషం. 2005నుంచి ఉపాధ్యాయ వృత్తిలో ఉన్న హరికృష్ణ 2017లో ఐలవరం జెడ్‌పి ఉన్నత పాఠశాలకు వచ్చారు. స్వతహాగా ఇంగ్లీష్ టీచర్ అయినందున తన నైపుణ్యాన్ని పెంపొందించుకునేందుకు ఇతర దేశాల ఉపాధ్యాయులతో సామాజిక మాధ్యమాల్లో ఒక గ్రూపును ప్రారంభించి అందులో విద్యార్థులను భాగస్వాములను చేసి మంచి ఫలితాలు స్వాధీనం చేసుకుంటున్నారు. తన స్వగ్రామం మంగళగిరితోపాటు భట్టిప్రోలుకు నేడు దేశ విదేశాలలో గుర్తింపు తెచ్చారు. హెచ్‌ఎంగా పనిచేసిన కాటూరు లక్ష్మీనారాయణ ప్రోత్సాహంతో పాఠశాలలో విద్యార్థులకు స్కైప్ ద్వారా ఇప్పటికే 70దేశాలలో వందలాది పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులతో ఎప్పటికప్పుడు స్థానిక పాఠశాల విద్యార్థులను మాట్లాడిస్తున్నారు. ఇక్కడున్న పరిస్థితుల దృష్ట్యా విదేశీయులు కొందరు ఇక్కడి పేద విద్యార్థులను దత్తత తీసుకొని అవసరమైన ఆర్థిక, విద్యాపరంగా సహకారాలు అందిస్తున్నారు. హరికృష్ణ చేస్తున్న కృషికి నిదర్శనంగా 2020లో అమెరికాలోని డిపార్ట్మెంట్ ఆఫ్ స్టేట్ బ్యూరో ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ కల్చరల్ అఫైర్స్ పర్యవేక్షించే ఫుల్ బ్రైట్ టీచింగ్ ఎక్సలెంట్ అండ్ అచీవ్మెంట్ ప్రోగ్రాంకు ఎంపికయ్యారు. దీంతో అమెరికాలోని అర్కన్స యూనివర్సిటీలో 45రోజుల ఫెలోషిప్ కూడా పూర్తి చేశారు. ఈ ఫెలోషిప్‌కు భారత్ నుండి ఆరుగురు ఎంపికగా వారిలో ఏపీ నుండి హరికృష్ణ ఒక్కరికి మాత్రమే అవకాశం లభించింది.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

పంచాయతీలో సానిటరీ ఇన్స్‌పెక్టర్‌గా పని చేస్తున్న శ్రీరాములుకు ఉద్యోగోన్నతి లభించింది. శ్రీకాకుళం జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారిగా పదోన్నతి పొంది బదలీ కానున్నారు. సర్పంచ్ ధారా రవికరణ్మయి బదిలీ పత్రాన్ని శ్రీరాంకు అంద చేశారు. సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఇప్పటికే గ్రామంలో రెండుసార్లు శానిటరీ ఇన్స్‌పెక్టర్‌గా పనిచేసిన శ్రీరాములు ప్రజలందరికీ సుపరిచితుడని అన్నారు. క్రమం తప్పకుండా విధులు నిర్వహించేవాడని అన్నారు. నిబద్ధతతో పనిచేసేవారని అన్నారు. సిబ్బందితో పని చేయిస్తూ సమస్యల పరిష్కారానికి ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఉండేవారన్నారు. ఆయన పదోన్నతి పొందటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి కోట శ్రీనివాసరావు, పాలకవర్గ సభ్యులు, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

సావిత్రి మృతికి ఆనందబాబు నివాళి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గ్రామానికి చెందిన చిరు వ్యాపారి మురుమళ్ళ సావిత్రి (66) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. గ్రామంలో సుపరిచితురాలైన ఈమె మృతి పట్ల పలువురు వ్యాపారులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతురాలి కుమారుడు సత్యనారాయణ ఓ టీవీ ఛానల్ రిపోర్టర్‌గా పనిచేస్తున్నారు. ఆమె మృతి సమాచారం తెలుసుకున్న మాజీ మంత్రి నక్కా ఆనందబాబు సావిత్రి ఇంటికి వెళ్లారు. ఆమె మృతదేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఆయనవెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి తూర్గుంట్ల సాయిబాబా, టిడిపి మండల కన్వీనర్ వాకా శేషుబాబు, మాజీ కన్వీనర్ ఎర్రంశెట్టి కరుణ శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ నాయకులు కనపర్తి సుందర్రావు, ఎడ్ల జయశీలరావు, బట్టు మల్లికార్జునరావు, సిరాజుద్దీన్ ఉన్నారు.



ఆరోగ్యశ్రీ బ్రోచర్ ఆవిష్కరిస్తున్న స్పెషల్ ఆఫీసర్ డా. అశోక్‌బాబు

ఆరోగ్యశ్రీతో పేదలకు కార్పొరేట్ వైద్యం

ప్రజశక్తి - చీరాల

ఆరోగ్య శ్రీ ద్వారా పేదలకు కార్పొరేట్ వైద్యం అందుబాటులో ఉందని ఏపీ ఆరోగ్య శ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదాల అశోక్ బాబు అన్నారు. పట్టణంలోని పలు హాస్పిటల్స్‌ను ఆయన గురువారం సందర్శించారు. శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాస్పిటల్‌లో వైఎస్సార్ ఆరోగ్య శ్రీ ద్వారా వైద్యం పొందుతున్న పేషెంట్లను పరామర్శించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ డైరెక్టర్ డాక్టర్ తాడివలస దేవరాజు మాట్లాడుతూ ఆరోగ్యశ్రీ కార్డు ఉన్నవారికి ఆపరేషన్లు ఉచితంగా చేస్తున్నట్లు తెలిపారు. మొదటిసారిగా డయాలసిస్ సౌకర్యం కలిగిన ఏకైక హాస్పిటల్ అని తెలిపారు. కార్యక్రమంలో శ్రీ కామాక్షి కేర్ హాస్పిటల్ జనరల్ ఫిజీషియన్ డాక్టర్ శ్రావణ్ కుమార్‌రెడ్డి, ఎముకల స్పెషలిస్ట్ డాక్టర్ కృష్ణ చైతన్య చౌదరి, జనరల్ సర్జన్ కాటూరి శ్యాంబాబు, డాక్టర్ నరేష్, హాస్పిటల్ జిఎం తాడివలస సురేష్, అనిల్ పాల్గొన్నారు.

వేటపాలెం : ప్రజల ఆరోగ్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఆరోగ్యశ్రీ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ యాదల అశోక్ బాబు అన్నారు. స్థానిక బండ్ల ఆదెమ్మ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన గురువారం సందర్శించారు. రూ.1.70కోట్లతో అత్యాధునిక వసతులతో వేటపాలెం హాస్పటల్ నిర్మించినట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ బాలరాజు పాల్గొన్నారు.



జాషువ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిపిఎం నేతలు

జాషువాకు ఘన నివాళి

ప్రజాశక్తి - అమృతలూరు

మండలంలోని కూచిపూడిలో గుర్రం జాషువా 128వ జయంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. వ్యవసాయకార్మిక సంఘం ఆధ్వర్యంలో జాషువా చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సీపీయం నాయకులు బి అగస్టిన్ మాట్లాడుతూ జాషువ రచనలు విశ్వవ్యాప్తమని అన్నారు. అవమానాలు ఎదుర్కొన్న చోటే సన్మానాలు అందుకున్న గొప్ప కవి అని అన్నారు. జాషువా సామాజిక విప్లవకారుడని అన్నారు. అణగారిన వర్గాల ఆవేదననే ఆయన కవితల్లో, రచనల్లో చూపారని అన్నారు. అంటరాని తనానికి వ్యతిరేకంగా గళం విప్పిన మహాకవి జాషువా అని అన్నారు. కార్యక్రమంలో పులివర్తి రాజు, చావలి రమేష్, కె భీమయ్య పాల్గొన్నారు.



ఆటో యూనియన్ ప్రారంభంలో మాట్లాడుతున్న కొండయ్య

కార్మికులు ఐక్యంగా ఉండాలి

ప్రజాశక్తి - కారంచేడు

మండలంలో సిఐటియు ఆధ్వర్యంలో శ్రీ ప్రసన్నాంజనేయ ఆటో వర్కర్స్ యూనియన్ నూతనంగా ఏర్పాటు చేశారు. యూనియన్ జనరల్ బాడీ సమావేశం కాల్వ సెంటర్లో యూనియన్ అధ్యక్షులు ఆవులమంద వెంకటేశ్వరరావు అధ్యక్షతన గురువారం నిర్వహించారు. యూనియన్ బోర్డును సిఐటియు నాయకులు భయ్యా శంకర్ ఆవిష్కరించారు. సభలో యుటిఎఫ్ నాయకులు పావులూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ యూనియన్ ఏర్పాటు చేసుకోవడం శుభపరిణామని అన్నారు. సంఘ గౌరవ అధ్యక్షులు పి కొండయ్య మాట్లాడుతూ ప్రభుత్వం నుండి అన్ని రాయితీలు రాబట్టుకోవడానికి యూనియన్ అవసరమని అన్నారు. డ్రైవర్ మిత్ర ఆటో డ్రైవర్ల అందరికీ వర్తింపజేయాలని కోరారు. ఆటో డ్రైవర్లపై వేస్తున్న వివిధ రకాల పన్నులు తగ్గించాలని కోరారు. అందరినీ కలుపుకొని ఐక్యంగా యూనియన్ నడుపుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కార్యదర్శి బి గోపి, ఉపాధ్యక్షులు ఓ శంకరు, డి అంకయ్య, ఉపాధ్యక్షులు డి రాంబాబు, ఎస్ కరుణాకర్, కోశాధికారి ఎస్‌కె బాజీ, ఆటో కార్మికులు పాల్గొన్నారు.



ఎన్ఎస్ఎస్ క్యాంపులో వైద్యశిభిరం నిర్వహిస్తున్న విద్యార్థులు

ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి అవసరం

ప్రజశక్తి - చీరాల

ఆధునిక జీవన విధానంలో పని ఒత్తిళ్ళతో ఆరోగ్యంపై దృష్టి సారించక అనారోగ్య పాలవుతున్నారని డాక్టర్ విమల అన్నారు. బాపట్ల డాక్టర్ ఎన్టిఆర్ ఆహార విజ్ఞాన సాంకేతిక కళాశాల ఆధ్వర్యంలో మండలంలోని కావూరివారిపాలెంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం 2వ రోజు ఆమె మాట్లాడారు. ఎన్ఎస్ఎస్ వాలంటీర్ల ఉచిత వైద్య శిబిరంను జనరల్ ఫిజిషియన్ డాక్టర్ అజ్మతుల కళాశాల ఫార్మసిస్ట్‌తో కలిసి నిర్వహించారు. 150మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. సమతుల పోషణపై ర్యాలీ నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్స్ డాక్టర్ విమల బీరా, డాక్టర్ బ్లెస్సి సాగర్, పిడి ఫణీంద్ర కుమార్, విద్యార్థి వ్యవహారాల డీన్ డాక్టర్ పి సాంబశివరావు, అసోసియేట్ డీన్ ఇంచార్జి డాక్టర్ సిహెచ్‌వివి సత్యనారాయణ, చీరాల ఆర్‌బికె ఛైర్మన్ కె రమణరెడ్డి పాల్గొన్నారు.



భగత్‌సింగ్‌కు ఎస్ఎఫ్ఐ నేతల నివాళి

భగత్ సింగ్ జయంతి

ప్రజాశక్తి - భట్టిప్రోలు

భగత్ సింగ్ 116వ జయంతిని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. భగత్ సింగ్ చిత్రపటానికి యుటిఎఫ్ మండల కార్యదర్శి వై సురేష్ పూలమాలవేసి నివాళులర్పించారు. భగత్ సింగ్ ఆశయాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని సూచించారు. తెల్ల దొరల పాలన నుండి భారతదేశ విముక్తి కోసం 23ఏళ్ల వయసులోనే భగత్ సింగ్ పోరాటాలు కొనసాగించారని గుర్తు చేశారు. విద్యార్థులు ఆయన స్ఫూర్తితో పని చేయాలని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ బాపట్ల జిల్లా అధ్యక్షులు పి మనోజ్, మండల అధ్యక్ష, కార్యదర్శులు మొహిదీన్, జగదీష్ ఉన్నారు.



ఎపిటిఎఫ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు

ఏపీటీఎఫ్ కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - పంగులూరు

ఏపీటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా తన్నీరు వెంకట్రావు, షేక్ రహమతుల్లా ఎన్నికయ్యారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం ఏపీటీఎఫ్ సభ్యులు సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ విద్యావిధానం వలన పిల్లలు, ఉపాధ్యాయులు తీవ్ర వొత్తిడికి గురవుతున్నారని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఎ శేఖర్‌బాబు అన్నారు. రూ.వేల కోట్లు విద్యారంగంపై ఖర్చు చేస్తున్నట్లు ప్రజలలో భ్రమ కల్పిస్తున్నారని అన్నారు. వేల సంఖ్యలో స్కూళ్లు మూసేస్తున్నారని అన్నారు. ప్రపంచంలో ఎక్కడ పాఠశాల హెచ్‌ఎంలకు బాత్రూం ఫోటోలు తీసే బాధ్యత లేదని అన్నారు. ఒక్క ఎపిలో మాత్రమే అమలు జరుగుతుందని తెలిపారు. ఆధునిక సాంకేతిక వైపు అడుగులు వేస్తూనే విద్యారంగాన్ని ప్రైవేటుపరం చేయడానికి వడివడిగా ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు ఆరోపించారు.

సాహిత్యంతో సమాజాన్ని మేల్కొలిపిన జాషువా



బీసీ సంఘాల ఆధ్వర్యంలో జాషువా విగ్రహానికి నివాళి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

మహాకవి గుర్రం జాషువా సాహిత్యం ద్వారా సమాజాన్ని మేలుకొలిపిన మహనీయుడని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వర్లురెడ్డి అన్నారు. గురువారం మహాకవి గుర్రం జాషువా 128వ జయంతి సందర్భంగా జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జాషువా చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కుల మతాలకతీతంగా సమాజంలో పీడిత ప్రజల కోసం తన రచనల ద్వారా మేలు కొలిపేందుకు ఎంతో కృషి చేసిన మహోన్నత కవి అని కొనియాడారు. జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా వెదుళ్లపల్లి చైతన్య భవనంలో జరిగిన కార్యక్రమంలో పండితులు పామరులకు సులభంగా అర్థమయ్యేలా పద్యాలు,



జాషువాకు నివాళి అర్పిస్తున్న జనవిజ్ఞానవేదిక నాయకులు

పాటలు రచించి వారి మనసుల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. సమాజంలోని అసమానతలను చీల్చి చెండాడిన నవయుగ కవి చక్రవర్తి గుర్రం జాషువా అని అభివర్ణించారు. ఈ కార్యక్రమంలో చింత కిరణ్ కుమార్ బి రమేష్ బాబు, ఎఎస్‌కె రోషన్‌బాబు, బ్రహ్మారెడ్డి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

బాపట్ల: గుర్రం జాషువా 128వ జయంతి వేడుకలను గురువారం బాపట్లలో ఘనంగా నిర్వహించారు. పట్టణంలో ఎబిఎం హైస్కూల్ ఎదురుగా ఉన్న గుర్రం జాషువా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాపట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ అధ్యక్షుడు పఠాన్ రాజేష్ మాట్లాడుతూ నేటి యువతకు గుర్రం జాషువా మార్గదర్శకులని అన్నారు. దశాబ్దాలుగా ఎందరో కవులు జాషువా ను స్ఫూర్తిగా తీసుకుని తమ రచనలు కొనసాగించారన్నారు. సమాజంలో కుల వివక్షను విడనాడేందుకు ఆయన రచనలు సామాన్య ప్రజల్లో చైతన్యం కలిగించాయన్నారు. తెలుగు సాహిత్య లోకంలో జాషువా రచించిన 'గబ్బిలం' సాహిత్య రంగంలో స్ఫూర్తిగా నిలిచిందన్నారు. ఆధునిక తెలుగు కవుల్లో గుఱ్ఱం జాషువాది అగ్రస్థానమని అన్నారు. కార్యక్రమంలో బక్కా రోశయ్య, దోనేపూడి రవి, నక్కల రాంబాబు, గాంధీ, శీలం సాగర్, తాజుద్దీన్, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

జాషువా రచనలు నేటి తరానికి అనుసరణీయం

జాషువా రచనలు నేటి తరానికి అనుసరణీయమని సమాజవాది పార్టీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు గొర్ల శ్రీనివాసరావు అన్నారు. గురువారం జాషువా 108వ జయంతిని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బీసీ సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత ప్రిన్సిపల్ దాసరి శ్యామ్ లివింగ్ స్టన్, ఎనుముల భాస్కర్ గౌడ్, మోర్ల చిన్న వెంకటేశ్వరరావు, చీమకుర్తి కష్ణ చైతన్య, నాగూర్, మారం రవికుమార్, తోట దుర్గారావు, శరత్, లంబు సాంబయ్య, దర్శి భాస్కరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.



జాషువా విగ్రహానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

హార్ట్ ఎటాక్ నివారణ సాధ్యమేనా?

ఈ మధ్యకాలంలో పునీత్ రాజకుమార్, గౌతమ్‌రెడ్డి లాంటి ప్రముఖ వ్యక్తుల ఆకస్మిక మరణాలు చాలా మందిని కలవరపెడుతున్న నేపథ్యంలో, అసలు హార్ట్ ఎటాక్ నివారణ సాధ్యమేనా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. సరైన అవగాహనతో, ఆరోగ్య సూత్రాలను పాటించటం ద్వారా, సరైన సమయంలో వైద్య సహాయం పొందటం ద్వారా ఇది కొంతవరకు సాధ్యమని చెప్పవచ్చు.

ప్రపంచ ఆరోగ్య సంస్థ వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్ వారి సర్వే ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా మరణించేవారిలో సగంపైన మరణాలు కార్డియో వసిక్యూలర్ డిసీజ్ హార్ట్ ఎటాక్, బ్రెయిన్‌స్ట్రోక్, పెరాలసిస్ ద్వారా చనిపోతున్నారు. ఇది క్యాన్సర్ మరణాల కన్నా చాలా ఎక్కువ. రోజురోజుకూ పెరుగుతున్న ఈ మరణాలను అరికట్టడానికి ఆకస్మిక గుండె మరణాల ద్వారా నిస్సహాయులుగా మారి, దీనవ్యవస్థలో ఉన్న కుటుంబాలను కాపాడటానికి, గుండె జబ్బుల గురించి అవగాహన పెంచటమే సరైన మార్గమని ప్రతి సంవత్సరం ఒక నూతన సందేశం ద్వారా ప్రజల గుండె ఆరోగ్యాన్ని కాపాడే ప్రయత్నం చేస్తున్నారు.

గుండె జబ్బుల గురించి తెలుసుకోవడం ద్వారా గుండెజబ్బులను నివారించుకొనే అవకాశమున్నది. అలాగే మనస్ఫూర్తిగా తోటి మనిషికి సహాయపడటం ద్వారా మానసిక ఆరోగ్యం పెంచుకొని గుండె జబ్బులను నివారించుకోవచ్చని వరల్డ్ హెల్త్ ఫెడరేషన్ సూచిస్తుంది.

ఆరోగ్య సూత్రాన్ని పాటిస్తూ, తగిన జాగ్రత్తలు తీసుకొంటూ, పొగతాగుట, మద్యం మాంసాలకు, మానసిక ఒత్తిడికి దూరంగా ఉంటూ, రోజు వాకింగ్ చేస్తూ, సకాలంలో వైద్యసలహాలు తీసుకొంటూ ముందుగా మీ గుండె ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తోటి మనిషి మానసిక, శారీరక ఆరోగ్యం కాపాడటంలో మీ వంతు కషి హదయపూర్వకంగా, మనస్ఫూర్తిగా చేయాలనీ మీ వంతుగా కాలుష్య నివారణ చేయాలని, మీ వంతుగా కాలుష్యనివారణ చేయాలని, చెట్లు నాటటం ద్వారా, చెట్లను పరిరక్షించటం ద్వారా, వాహన కాలుష్యం, ఏ.సి.కాలుష్యం పారిశ్రామికప్రమాణాలు పాటించడం ద్వారా, జంతు రక్షణ పర్యావరణ సమతుల్యత పాటించడం ప్రకతిని రక్షించటం చేయమని వరల్డ్ హార్ట్ ఫెడరేషన్ ఈ వరల్డ్ హార్ట్‌డే రోజున పిలుపునిస్తుంది. ఇవన్నీ ఇప్పటికే పాటించేవారు కొంతమంది ఉండవచ్చు. మిగిలిన వారు కూడా ఇది స్ఫూర్తిగా తీసుకోని మనవంతు పాత్ర పోషించటం ఎంతో అవసరం.



డాక్టర్ వి కేశవ

హార్ట్ ఎటాక్, పెరాలసిస్ స్ట్రోక్ మరణాలు యింత ఎక్కువగా ఎందుకు ఉంటున్నాయి అంటే మనం వాటికి సంబంధించి ప్రమాద హెచ్చరికలు, గమనించటం లేదు. మరియు హెర్ట్ ఎటాక్ వచ్చిన తరువాత అవగాహన లోపంతో విలువైన సమయాన్ని వధా చేసుకొని సరైన వైద్యం తీసుకోలేక పోతున్నారు. సరైన వైద్యం మొదలైన తరువాత కూడా రకరకాల అపోహలతో దాన్ని సక్రమంగా కొనసాగించలేకపోవుచున్నారు. మరియు కొంత మంది అవసరమైన ఆందోళనతో వైద్యం ద్వారా సత్ఫలితాలు ద్వారా నిష్ప్రయోజనం అవుతున్నాయి.

షుగర్ వ్యాధి

గుండెపోటులు సాధారణంగా ప్రతి వందమందిలో పదిమందికి వస్తుంది. (డయాబెటిస్) పొగత్రాగేవారు హై బీపీ ఉన్నవారిలోనూ శారీరక వ్యాయామం కొద్దిగా కూడా చేయని వారిలోనూ 2,3 రెట్లు అధికంగా వచ్చే అవకాశం ఉన్నది జెన్యూరీత్యా వంశపారపర్యంగా కూడా హార్ట్‌ఎటాక్‌లో ఎక్కువమందిలో వచ్చే అవకాశం ఉన్నది కాబట్టి ఈకేటగిరీలో ఉన్నవారందరూ విధిగా 35 సంవత్సరాల తర్వాత గుండెకు సంబంధించి ప్రివెంటివ్ చెకప్ చేయించుకోవాలి. తద్వారా వారిలో కనీసం సగం మందికి పైగా ప్రమాదకరమైన గుండెజబ్బుల బారిన పడకుండా ఉంటారు. షుగరు, బిపి, కొలెస్ట్రాల్‌కి సంబంధించిన వైద్యం జీవితాంతం సక్రమంగా కొనసాగించవలసిన అవసరం గురించి వేరే చెప్పనక్కర్లేదు. పొగతాగేవారి పక్కన కూడా హార్ట్ ఎటాక్ వచ్చే రిస్కు పెరుగుతుంది. పొగాకు ఏరూపేణా తీసుకున్న కూడా ప్రమాదమే. మత్తు, మద్యం కూడా గుండెకు హానికరమే. అనవసరంగా ఆందోళన చెందే వారిలోనూ గుండె జబ్బులు అధికంగా వస్తుంటాయి. అసలు శారీరక శ్రమ చేయకుండా ఉండే వారిలో హార్ట్ ఎటాక్ ఎక్కువశాతం రావటమే కాక అవి వచ్చిన తర్వాత తట్టుకునే సామర్థ్యం కూడా చాలా తక్కువగా ఉంటుంది.

సకాలంలో గుండె డాక్టర్ వద్దకు వెళ్లాలి

హార్ట్‌ఎటాక్ ఒకసారి వచ్చిన తర్వాత వైద్యం ఎంత ముఖ్యమో, సకాలంలో గుండె డాక్టర్ దగ్గరకు వెళ్లడం వారి సలహా తూచా తప్పక పాటించడం అంత అవసరం. హార్ట్ ఎటాక్ వచ్చిన వారిలో దాదాపు నూటికి 95% బయటపడే అవకాశం ఉన్నందున ఆందోళన చెందకుండా నిబ్బరంగా ఉండటం ఎంతో అవసరం. గుండెకు సంబంధించిన వైద్యం, మందులు జీవితాంతం వాడాలనే విషయాన్ని మరవకూడదు. తెలిసీ తెలియని వారి సలహా పాటించడం, మధ్యలో మందులు మానేయటం ఆత్మహత్యా సదృశ్యం. బిపి, షుగర్, పొగతాగే వారు కుటుంబంలో గుండె జబ్బులు వున్నవారు ముందుగా గుండె వైద్య నిపుణులను సంప్రదించి సలహా తీసుకోవటం మంచిది. వ్యాయామం కూడా గంటకు మించకుండా అతిగా అలసిపోకుండా చూసుకోవాల్సిన అవసరముంది. జిమ్‌లో ఎఇడి పరికరాల అమర్చి అవి సకాలంలో ఉపయోగించటం ద్వారా ఆకస్మిక మరణాలు చాలా వరకు నివారించవచ్చును. అన్ని పాఠశాలలో బేసిక్ సిఆర్‌పి ప్రోగ్రాం శిక్షణ యివ్వటం చాలా అవసరం.

చివరిగా గుండె జబ్బుల గురించి, వైద్యం గురించి చాలామందికి చాలా అపోహలు ఉన్నాయి. తీవ్రమైన నొప్పి లేకుండా గుండెపోటు రాదని, గుండె జబ్బు లేదని ఉండే అవకాశం లేదని, స్టంట్ వేయించుకోవాలా, ఆపరేషన్ చేయించుకోవాలా? అని చిన్న వయసులో హార్ట్‌ఎటాక్‌లు రావని, ఒక సిగరెట్ తాగితే గుండెకు ఏమీ కాదని, మద్యం గుండెకు ఉపయోగకరమని ఇలా ఎన్నో అపోహాలు ఉన్నాయి. షుగర్ కంట్రోల్‌లో ఉంటే గుండె జబ్బు రాదనే అపోహ ఉంది. గుండెపోటు అతి చిన్న వయసులో కూడా రావచ్చు, షుగరు, బిపి పూర్తి కంట్రోల్‌లో ఉన్నా హార్ట్ ఎటాక్ వచ్చే అవకాశం ఉంటుంది. కానీ అన్నీ కంట్రోల్లో లేకపోతే ప్రమాదం ఇంకా ఎక్కువ అవుతుంది. అసలు నొప్పి లేకుండా పూర్తి సైలెంట్‌గా కూడా ప్రమాదకరమైన హార్ట్ ఎటాక్ రావచ్చు. ముఖ్యంగా షుగర్ వ్యాధిగ్రస్తుల్లో మద్యం కూడా గుండెకు పూర్తి హానికరం. ఏ మాత్రం అనుమానం అవసరం లేదు. ఆపరేషన్ చేయాలా యాంజియోప్లాస్టి స్టెంట్ చేయాలా? అన్నది డాక్టర్ నిర్ణయానికి వదిలివేయటం ఎప్పటికీ మంచిదే. హృద్రోగులను కాపాడాలని గుండె వైద్యులతో పాటు వైద్యరంగం నిరంతరం శ్రమిస్తుంది. అందరికీ గుండె ఆరోగ్యంగా చూడాలన్నదే మా ఆకాంక్ష.

- డాక్టర్ వి కేశవ, ఎండి, డిఎమ్, ఎఫ్ఎసిసి, ఎఫ్ఇఎస్‌సి
సీనియర్ గుండె వైద్య నిపుణులు
అమృత హార్ట్ హాస్పిటల్, ఒంగోలు




పేస్ కళాశాలలో ప్రొఫెసర్ రవీంద్రను సన్మానిస్తున్న కళాశాల సిబ్బంది

గెస్ట్ లెక్చర్ ద్వారా ఉద్యోగ అవకాశాలు

గుంటూరు ప్రొఫెసర్ రవీంద్ర

ప్రజాశక్తి-టంగుటూరు

ఇంజనీరింగ్ కళాశాలలో గెస్ట్ లెక్చర్ కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని గుంటూరు వివిఐటి ప్రొఫెసర్ ఎస్ రవీంద్ర పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు గెస్ట్ లెక్చర్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో మ్యాట్ లాబ్ ప్రయోజనాలను విద్యార్థులకు వివరించారు. ప్రస్తుతం నడుస్తున్న ఎలక్ట్రికల్ వెహికల్స్ డిజైన్‌లో మ్యాట్ ల్యాబ్‌ను ఉపయోగిస్తారన్నారు. మ్యాట్ ల్యాబ్ కోర్సును విద్యార్థులు నేర్చుకోవడం ద్వారా అనేక కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు వెతుక్కుంటూ వస్తాయన్నారు. గెస్ట్ లెక్చర్ కార్యక్రమాల ప్రయోజనాలను ప్రతి విద్యార్థి గుర్తించి సద్వినియోగం చేసుకోవాలని ప్రొఫెసర్ రవీంద్ర విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్, ట్రిపుల్ ఈ విభాగాధిపతి బి నాగరాజు, కో కన్వీనర్లు కెవి నారాయణ, కోఆర్డినేటర్లు కేవీ శివారెడ్డి, ఎం మల్లికార్జున, కె జీవన్, కళాశాల అధ్యాపక సిబ్బంది పాల్గొన్నారు.



మౌలాలికి నగదు అందజేస్తున్న శ్రీనివాసరావు

జర్నలిస్టులకు అండగా ఉందాం

ప్రజాశక్తి-బాపట్ల: ఆపదలో ఉన్న జర్నలిస్టు మిత్రులకు చేయూతనిచ్చి అండగా నిలిచేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని బాపట్ల జర్నలిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ పూర్వ వ్యవస్థాపక అధ్యక్షులు వేజెండ్ల శ్రీనివాసరావు అన్నారు. ఇటీవల అనారోగ్యానికి గురైన చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న విలేఖరి షేక్ మౌలాలికి వేజెండ్ల శ్రీనివాసరావు గురువారం రూ.5 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆపదలో ఉన్న పాత్రికేయ మిత్రులకు సహాయం అందించేందుకు స్వచ్ఛంద సేవా సంస్థలు సైతం ముందుకు రావాలని కోరారు. శ్రీనివాసరావుతో పాటు నగదు అందజేసిన వారిలో విన్నకోట శ్రీనివాసరావు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంపిడిఒ రత్నజ్యోతి

నేడు మండల సమావేశం

ప్రజాశక్తి-టంగుటూరు: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని సమావేశపు హాలులో జరుగుతుందని ఎంపిడిఓ పి రత్నజ్యోతి తెలిపారు. ఎంపీపీ పటాపంజుల కోటేశ్వరమ్మ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి మండలంలోని అన్ని శాఖల అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు సకాలంలో, సమగ్ర సమాచారంతో హాజరు కావాలని ఎంపీడీఓ రత్నజ్యోతి సూచించారు.

ధరాభారం.. కొనిపెట్టలేం

మధ్యాహ్న భోజన నిర్వాహకుల ఆవేదన

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

అటు కూరగాయల ధరలు.. ఇటు నిత్యావసర సరుకుల ధరలు మండిపోతున్నాయి. పెరిగిన ధరలతో మధ్యాహ్న భోజనం తయారీ గిట్టుబాటు కావడం లేదని, పైగా మధ్యాహ్న భోజనం తయారీకి ఎంతో కష్టపడాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయని నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్న భోజనం సమకూర్చే వంట తయారీదారులు పలు సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. యర్రగొండపాలెం, పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దదోర్నాల మండలాల్లోని మధ్యాహ్నం భోజనం తయారీదారులు తమకు శ్రమ తప్ప ఫలితం ఉండటం లేదని మదనపడుతున్నారు. బహిరంగ మార్కెట్లో ధరలు మండిపోతున్నాయి. ప్రాథమిక పాఠశాలల పిల్లలకు రూ.5.88 పైసలు, యూపీ, ఉన్నత పాఠశాలల పిల్లలకు రూ.8.57 పైసలు చొప్పున ఇస్తున్నారు. ప్రభుత్వ మెనూ ప్రకారం వండడానికి ఇవి సరిపోవడం లేదని నిర్వాహకులు గగ్గోలు పెడుతున్నారు. కూరగాయల ధరలు బాగా పెరిగిపోవడంతో ఒక్క నెలకే రూ.15 వేలు దాటి బిల్లు అవుతోందని మధ్యాహ్న భోజన నిర్వాహకురాలు నాగమ్మ పేర్కొంది. కందిపప్పు కూడా కిలో రూ.120 పైబడి ధర ఉందని, అలాగే మిర్చి తదితర నిత్యావసర సరకుల ధరలు ఆకాశాన్నంటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 9, 10 తరగతి పిల్లలకు వండి పెడుతున్నా వారికి వండిన కష్టానికి గౌరవ వేతనం ఇవ్వడం లేదని అంటున్నారు.

వైపాలెం నియోజకవర్గంలో ఇలా..

యర్రగొండపాలెం నియోజకవర్గంలోని యర్రగొండపాలెం మండలంలో మొత్తం 63 ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజనం అమలవుతోంది. ఈ పాఠశాలల్లో 8,200 మంది విద్యార్థులు చదువుతుండగా 7,500 మంది విద్యార్థులు



మధ్యాహ్న భోజనం వడ్డిస్తున్న దృశ్యాలు

మధ్యాహ్నం భోజనం తింటున్నారు. త్రిపురాంతకం మండలంలో 62 పాఠశాలలకు గాను 6,354 మంది విద్యార్థులు చదువుతుండగా 6,100 మంది విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేస్తున్నారు. పుల్లలచెరువు మండలంలో 59 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 4,200 మంది విద్యార్థులు చదువుతుండగా 3,800 మంది విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేస్తున్నారు. పెద్దదోర్నాల మండలంలో 51 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా 5,500 మంది విద్యార్థులు చదువుతుండగా వారిలో 5052 మంది విద్యార్థులు మధ్యాహ్నం భోజనం చేస్తున్నారు.

విద్యార్థికి రూ.15 ఇవ్వాలి

తాము 16 సంవత్సరాలుగా మధ్యాహ్న భోజనం తయారు చేసి విద్యార్థులకు పెడుతున్నామని మధ్యాహ్న భోజన నిర్వాహకులు లక్ష్మి, నాగేశ్వరి తెలిపారు. ఒక విద్యార్థికి రూ.8.57 పైసలు ఇస్తున్నారని చెప్పారు. కూరగాయల ధరలతో పాటు వంటనూనె, కిరాణా సామగ్రి ధరలు ప్రస్తుత సమయంలో బాగా పెరిగిపోయాయని తెలిపారు.



ఎండుమిర్చి, పప్పులు ఇలా అన్నింటి ధరలు ఆకాశానంటుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ఒక్కొక్క విద్యార్థికి రూ.15 ఇస్తే తాము పడిన శ్రమకు ఫలితం దక్కుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

గౌరవ వేతనం పెంచితే మంచిది

ప్రభుత్వం తమకు గౌరవ వేతనంగా ప్రస్తుతం రూ.3 వేలు ఇస్తోందని మధ్యాహ్న భోజన నిర్వాహకులు సుబ్బులు, మస్తాన్‌బి తెలిపారు. దీన్ని మరికొంత పెంచితే తమకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నిత్యావసర సరకుల ధరలు, కూరగాయల ధరలు విపరీతంగా పెరిగి పోవడంతో అధిక భారమవుతోందని తెలిపారు. ప్రస్తుతం గ్యాస్‌పై వంట చేస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం తమకు న్యాయం చేయాలని కోరారు.



నిమజ్జనానికి బయలుదేరిన వినాయకుడు

రూ.55,216 పలికిన వినాయకుడి లడ్డూ

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని ఒమ్మెవరం గ్రామంలో వినాయక విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన లడ్డూ వేలం పాటలో రూ.55,216 పలికింది. ఒమ్మెవరం గ్రామంలో అందరూ ఐక్యంగా గత 25 సంవత్సరాల నుంచి ఒకేఒక్క వినాయకున్ని ఏర్పాటు చేసి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా వినాయక విగ్రహాన్ని ఏర్పాటు చేసి నవరాత్రులు పూర్తి చేసుకొని గురువారం గ్రామోత్సవం నిర్వహించి సుమారు 20 ట్రాక్టర్లతో ర్యాలీగా పెద్దగంజాం సముద్ర తీరానికి నిమజ్జనానికి తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, పిల్లలు మహిళలతో సహా ఉత్సాహంగా పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్

రూ.1,41,000 పలికిన లడ్డూ

ప్రజాశక్తి-చీమకుర్తి

స్థానిక తూర్పు బజారులో ఏర్పాటు చేసిన వినాయకుడి లడ్డూ రూ.1,41,000 పలికింది. గురువారం జరిగిన లడ్డూ వేలంలో గుడిపూడి శ్రీను ఆయన కుమారుడు అనిల్ లడ్డూను సొంతం చేసుకున్నారు. చివరిరోజు కావడంతో సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ పూజలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మన్నం ప్రసాదు, ఉన్నం సుబ్బారావు, జి రాఘవరావు, పూనాటి వెంకటరావు, యడ్లపల్లి రామబ్రహ్మం, కాట్రగడ్డ రమణయ్య, రామినేని యోగయ్య, తెలుగుయువత నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



దీక్షలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్

14వ రోజు కొనసాగిన టిడిపి దీక్షలు

ప్రజాశక్తి-చీమకుర్తి

టిడిపి ఆధ్వర్యంలో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుకు మద్దతుగా 14వ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. గురువారం జరిగిన కార్యక్రమంలో సంతనూతలపాడు మాజీ ఎమ్మెల్యే బిఎన్ విజయకుమార్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో నియంత పాలన సాగుతుందని, చంద్రబాబు అన్ని నిర్బంధాలను ఛేదించుకొని బయటకు వస్తారని అన్నారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా నాయకులు మన్నం ప్రసాదు, కాట్రగడ్డ రమణయ్య, గొల్లపూడి సుబ్బారావు, మండవ జయంత్‌బాబు, మద్దినేని హరిబాబు, ఉన్నం సుబ్బారావు, మండవ గోపి, శేషయ్య, రమేష్, శ్రీనివాసరావు, మండవ కోటేశ్వరరావు, ప్రభాకర్, బుజ్జి, హరికుమార్, నరసింహారావు, సురేష్, పి అక్బర్, ఆంజనేయులు పాల్గొన్నారు.



సాయం అందిస్తున్న మాజీ ఎమ్మెల్యే దారా సాంబయ్య

అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి 'దారా' సహకారం

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

నాగులుప్పలపాడు బస్టాండ్ కూడలిలో నిర్మిస్తున్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణానికి సంతనూతలపాడు నియోజవర్గ మాజీ శాసనసభ్యులు దారా సాంబయ్య రూ.20 వేలు తనవంతు సహకారం అందించారు. విగ్రహ నిర్మాణాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా దారా సాంబయ్య మాట్లాడుతూ అంబేద్కర్ కల్పించిన రిజర్వేషన్ ద్వారా చదువుకొని ఉన్నత ఉద్యోగాలు చేస్తూ రాబోయే తరాలకు మార్గదర్శకత్వం చూపించే క్రమంలో కృతజ్ఞతగా డాక్టర్ అంబేద్కర్ విగ్రహాలు, అంబేద్కర్ గ్రంథాలయాలు, సాహిత్యాన్ని ప్రజలలోకి విరివిగా తీసుకుపోవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ముఖ్యంగా యువత తాగుడు, జూదం వంటి దురలవాట్లకు లోను కాకుండా క్రమశిక్షణగా ఉండాలని తెలిపారు. ఈ మండలవాసిగా మాజీ ప్రభుత్వ ఉద్యోగిగా మాజీ శాసనసభ్యులుగా నా సహాయ సహకారములు ఉంటాయని అన్నారు. డాక్టర్ అంబేద్కర్ గారు ఆశించిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ద్వారా సమసమాజ స్థాపన జరిగినప్పుడే ఈ విగ్రహ నిర్మాణాలకు అర్థం ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర దళిత మహాసభ రాష్ట్ర అధ్యక్షులు విగ్రహ నిర్మాణ కమిటీ గౌరవ అధ్యక్షులు పాలడుగు విజేంద్ర, విగ్రహ నిర్మాణ కమిటీ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గుంపుల సుబ్బారావు(పంతులు) దోనేంపూడి రవీంద్ర బాబు, గ్రామ మాజీ సర్పంచ్ దోనెంపూడి సుబ్బరాయుడు విగ్రహ కమిటీ ఉపాధ్యక్షులు కొట్టే ప్రతాప్, ట్రెజరర్ పీకా రమేష్ బాబు, కమిటీ సభ్యులు గుంపుల సుబ్బయ్య, ఆడె శ్రీనివాసరావు దోనెంపూడి వాసు తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమమే లక్ష్యం: మద్దిశెట్టి

ప్రజాశక్తి-కురిచేడు

రాష్ట్రంలో అర్హులైన ప్రతి ఒక్కరికి జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను అందించడమే ప్రభుత్వ ధ్యేయమని దర్శి శాసనసభ్యులు మద్దిశెట్టి వేణుగోపాల్ అన్నారు. గురువారం ఆయన మండలంలోని పడమర గంగవరం గ్రామ పంచాయతీ పరిధిలో గల రెడ్డన్నపల్లె గ్రామంలో గడప గడపకూ మన ప్రభుత్వంలో భాగంగా ఆయన గడప గడపకూ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయా అని అడిగి తెలుసుకున్నారు. అర్హత కలిగి ఎవరికైనా సంక్షేమ పథకాలు అందకపోతే అటువంటి వారి వివరాలను తన దృష్టికి తీసుకువస్తే సమస్యను వెంటనే పరిష్కరిస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన



గడప గడపకూలో పాల్గొన్న ఎమ్మెల్యే మద్దిశెట్టి

వెంట గ్రామ సర్పంచ్ కాసు భాస్కర్‌రెడ్డి, వైసిపి నాయకులు బెల్లం చంద్రశేఖర్‌రావు, మండల సచివాలయాల కన్వీనర్ మేరువ సుబ్బారెడ్డి, మాజీ జడ్‌పిటిసి వరికూటి వెంకటేశ్వర్లు, ఏఎంసి డైరక్టర్ కాకర్ల కాశయ్య తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన ప్రజారోగ్యం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

గత నెల నుంచి వరుసగా కురుస్తున్న వర్షాలతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమ య్యాయి. రహదారుల్లో నీరు చేరింది. మురుగు కాలువలు పొంగి ప్రవహిస్తున్నాయి. నివాసాల మధ్య ఖాళీగా ఉన్న కుంటల్లో నీరు చేరి దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయి. కనీస పారిశుద్ధ్య పనులు చేపట్టే పరిస్థితి లేకపోవడంతో విషజ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ప్రధానంగా పల్లెల్లో దోమల సమస్య అధికంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో మురుగునీటి కాలువల్లో పూడికలు తీయక, మురుగుపారుదల లేక రోజుల తరబడి నీరు నిల్వ ఉండి.. దుర్వాసన రావడం సాధారణ విషయమైంది. అన్ని ప్రాంతాల్లో తాగిపడేసిన కొబ్బరి బొండాల్లో నీరు చేరి దోమల వ్యాప్తికి కారణమవుతున్నాయి. రోడ్ల పక్కన చేరిన చెత్త, ఇతర వ్యర్థపదార్థాలు రోజుల తరబడి తరలించడం లేనందున ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో సీజనల్ జ్వరాల నివారణ కోసం దోమల లార్వాలు వ్యాప్తి చెందకుండా నివారణ చర్యలు చేపట్టేవారు. వీధుల్లో ఫాగింగ్ చేయడం, మురుగు నీటి కుంటల్లో ఆయిల్ బాల్స్ వదలడం, బ్లీచింగ్ చల్లడం లాంటి కార్యక్రమాలు చేసేవారు. కానీ ప్రస్తుతం గ్రామ పంచాయతీల్లో నిధుల కొరత కారణంగా పారిశుద్ధ్య పనులు చేపట్టే పరిస్థితి లేకుండా పోయింది. పురపాలక సంఘాల్లో కూడా ఫాగింగ్ యంత్రాలు మూలన పడేశారు. కొన్ని మేజర్ పంచాయతీలకు ఫాగింగ్ యంత్రాలు ఉన్నప్పటికీ అవి పనిచేయడం లేదు. పంచాయితీల్లో బిల్లుల చెల్లింపుల్లో ఉన్న ఇబ్బందుల వల్ల పారిశుద్ధ్య సామాగ్రి కూడా కొనే పరిస్థితి లేదు. దీంతో పాటు సరిపడా సిబ్బంది కూడా లేక ప్రజారోగ్య పనులు అటకెక్కాయి. జ్వరాలు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవలసిన అధికార యంత్రాంగం నిధుల కొరత కారణంగా పట్టనట్టు ఉంటున్నారు. కేసుల తీవ్రత పెరగకముందే అధికార యంత్రాంగం తగిన చర్యలు తీసుకోవలసి ఉంది.

ఈ ప్రభుత్వానికి ప్రజలే బుద్ధి చెబుతారు

నిరసన దీక్షల శిబిరం వద్ద టిడిపి నేతలు

ప్రజాశక్తి - బాపట్ల

గిరిజనులు పంతం పడితే జగన్మోహన్ రెడ్డి అంతం చూస్తారని టిడిపి గిరిజన విభగం అధ్యక్షుడు తిరుమలశెట్టి శ్రీనివాస రావు అన్నారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా టిడిపి ఇంచార్జ్ వేగేశన నరేంద్ర వర్మ ఆధ్వర్యంలో ఎస్‌టి సెల్ నాయకులు బాపట్లలో గురువారం రిలే నిరాహార దీక్షలు చేశారు. జగన్ అధికారంలోకి వచ్చాక గిరిజన సంక్షేమాన్ని గాలికొదిలేశారని ఆరోపించారు. బాక్సైట్‌ను త్రవ్వ కుంటూ లక్షలాది ఎకరాల గిరిజన భూములను సెజ్ల పేరుతో అన్యక్రాంతం చేస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో ఎస్టీ సెల్ కార్యదర్శి చుక్కా పాల్‌రాజ్, ఇండ్ల శ్రీనివాసరావు, ఏడుకొండలు, బల్లాని నాగరాజు, కట్టా సుజాత, వీరయ్య, నంబూరి నాంచారయ్య, గున్నం అంకమ్మ రావు, గోసు రాంబాబు, చౌటురి ఏడుకొండలు, మోటా జాన్, ఉయ్యాల శివ, గోలి వెంకటేష్, దేవరకొండ శ్రీను, రాఘవులు, కొమరగిరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అద్దంకి : టిడిపి అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా పట్టణంలోని రామా టాకీస్ సెంటర్ వద్ద 16వ రోజు రిలే నిరాహార దీక్షలు కొనసాగాయి. జె పంగులూరు టిడిపి క్లస్టర్ ఇంచార్జ్ కుక్కపల్లి ఏడుకొండలు, వలపర్ల సుబ్బారావు, కర్రీ సుబ్బారావు, బెల్లంకొండ దశరథ, కుక్కపల్లి పద్మ, చింతల విజయలక్ష్మి, దాసరి హనుమాయమ్మ, రావూరి సుభాషిని, తలపనేని వీరమ్మ, తలపనేని సీతా దీక్షలో కూర్చున్నారు. వీరికి గుర్రం శేఖర్, దాసరి హనుమంతరావు, వలపర్ల సుబ్బారావులు నల్ల కండవాలు వేసి దీక్ష ప్రారంభించారు. దీక్షా శిబిరంను ఎంఎల్ఏ గొట్టిపాటి రవికుమార్ సంఘీభావం తెలిపారు. నందమూరి కళాపరిషత్ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు అధ్యక్షత వహించిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ స్కిల్ డెవలప్మెంట్ ద్వారా 85వేల మందికి పైగా ఉపాధి పొందారని అన్నారు. వైసిపి అరాచకాలు చూడలేక వైసీపీకి చెందిన ఎంపీటీసీలు, జడ్పిటిసిలు, సర్పంచులు దాదాపు రెండు వేలమందికిపైగా గిద్దలూరులో టిడిపిలో చేరారని అన్నారు. పోస్ట్ కార్డు ఉద్యమంలో భాగంగా ఎమ్మెల్యే కూడా రాజమండ్రి చంద్రబాబుకి పోస్ట్ కార్డు రాసి పోస్ట్ చేశారు. కార్యక్రమంలో నాగినేని రామకృష్ణ, చిన్ని శ్రీనివాసరావు, బచ్చుల వాసు, ఎర్రాకుల రామాంజనేయులు, చేబ్రోలు వెంకటసుబ్బయ్య, సంధిరెడ్డి శ్రీనివాసరావు, కుందారపు రామారావు, వడ్డవల్లి పూర్ణ, కాకాని అశోక్, కందిమల్ల రామాంజనేయులు, చుండూరు మురళి, ఎస్‌కె మహబూబ్, ఎస్‌కె మొహిద్దీన్, ఎస్‌కె మదీనా, ఎడవల్లి అశోక్, స్వామి శ్రీను పాల్గొన్నారు.



బాపట్లలో టిడిపి ఎస్‌టి సెల్ నిరసన దీక్షలు

రేపల్లె : చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా చేపట్టిన రిలే దీక్షలు గురువారం 15వ రోజుకు చేరాయి. ఎమ్మెల్యే అనగాని సత్య ప్రసాద్ ఆధ్వర్యంలో యాదవులు దీక్షలో కూర్చున్నారు. శిబిరం వద్దకు ఆవుని, శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలో ఉన్న చిన్నారులను తీసుకువచ్చి వినూత్న రీతిలో చంద్రబాబుకు మద్దత్తు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ముమ్మనేని వెంకట సుబ్బయ్య, టీడీపీ నాయకులు అనగాని శివ ప్రసాద్, లీగల్ సెల్ నాయకులు వై ధర్మతేజ, వెనిగళ్ళ సుబ్రమణ్యం, నాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు.



రేపల్లెలో గోవులతో టిడిపి వినూత్న నిరసన

కారంచేడు : టీడీపీ అధినేత చంద్రబాబు అక్రమ అరెస్టును వ్యతిరేకిస్తూ టిడిపి సీనియర్ నాయకులు, పర్చూరు ఎఎంసి మాజీ చైర్మన్ యార్లగడ్డ అక్కయ్య చౌదరి ఆధ్వర్యంలో దీక్షలు గురువారంతో 20వ రోజుకి చేరాయి. సైకో పాలన పోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో కంభంపాటి నరేంద్ర, పాతూరి ఆదిలక్ష్మి, ఫరీద్, పాతూరు శివరాం, బోయిన శీను, విలేకరు శీను, తాళ్లూరి అనిల్ కుమార్, మస్తాన్, టిడిపి మహిళా అభిమానులు పాల్గొన్నారు.



చీరాల నిరసన దీక్షలో ఇన్‌ఛార్జి కొండయ్య

చీరాల : చంద్రబాబు మీటింగులకు, లోకేశ్ యువగళం పాదయాత్రకు వస్తున్న ప్రజాదరణను కట్టడి చేయాలనే దుర్బుద్ధితో అక్రమ అరెస్టులు చేశారని టిడిపి ఇన్చార్జి ఎంఎం కొండయ్య అన్నారు. వైసిపి అరాచకాలు ప్రజలు చూస్తున్నారని అన్నారు. టిడిపికి ప్రజలు బ్రహ్మరథం పడతారని అన్నారు. దీక్షలో టిడిపి రాష్ట్ర కార్యదర్శులు సలగల రాజశేఖర్, నాతాని ఉమామహేశ్వరరావు, మత్స్యకార నాయకుడు బందు గురవయ్య, గరికిన చిన్న, ఓసిపిల్లి తాతారావు, కుక్కల రమణబాబు, కొక్కిలగడ్డ గోపి, ఎరిపిల్లి సింహాద్రి, గరికిన బాలాజీ, చోడిపిల్లి బంగారురాజు, పార సునీల్, గరికన యాకోబు, గరికిన నవీన్, చేపల సైమన్, క్రిష్, పౌలు పాల్గొన్నారు.

బాపట్ల ఫొటోగ్రాఫర్స్‌కు బంగారు పతకాలు

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

ఫోటో గ్రఫీలో ప్రతిభ కలిగిన ఫోటోగ్రాఫర్లను ప్రపంచ పర్యాటక దినోత్సవం సంధర్భంగా ఆంధ్రప్రదేశ్ సృజనాత్మకత సంసృతి సమితి ప్రొత్సాహంతో విజయవాడ ఫోటోగ్రఫీ అకాడమి ఆఫ్ ఇండియా, ఇండియా ఇంటర్నెషనల్ ఫోటోగ్రాఫిక్ కౌన్సిల్ సంయుక్తంగా సత్కరించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సంధర్భంగా రాష్టం వ్యాప్తంగా నిర్వహించిన ఛాయాచిత్ర పోటీల్లో మండలంలోని ముత్తాయపాలెంకు చెందిన ఫోటోగ్రాఫర్ పివిఎస్ నాగరాజు, ఆదర్శనగర్‌కు చెందిన ఫోటోగ్రాఫర్ సంగాని ఏడుకొండలు, నిజాంపట్నంకు చెందిన ఫోటోగ్రాఫర్ దబ్బకూటి శ్రీనివాసరావుకు ప్రతిభ పురస్కార్ అవార్డు, బంగారు పథకాలు సాధించారు. ఈ పురస్కారాలను విజయవాడ బాలోత్సవ భవన్‌లో బుధవారం జరిగిన అవార్డు ప్రధానోత్సవంలో అడిషనల్ సీసీఎల్‌ఏ సెక్రెటరీ, సెర్ఫ్ సీఈఓ ఎ ఇంతియాజ్ చేతుల మీదగా అందుకున్నారు. కార్యక్ర మంలో ఫోటోగ్రఫీ అకాడమి ఆఫ్ ఇండి యా ఫౌండర్ చైర్మెన్ తమ్మా శ్రీనివాసరెడ్డి, ప్రెసిడెంట్ వెంకటరమణ, గోళ్ళ నారాయణ పాల్గొన్నారు.



అవార్డు అందుకుంటున్న పివిఎస్ నాగరాజు

నిజాంపట్నం : మండల కేంద్రంకు చెందిన సీనియర్ ఫోటోగ్రాఫర్ దబ్బకూటి శ్రీనివాసరావుకు ప్రతిష్టాత్మక ఫోటోగ్రఫీ అకాడమీ ఆఫ్ ఇండియా ప్రతిభా పురస్కారం లభించింది. చిన్నప్పటి నుంచి ఫోటోగ్రఫీ అంటే తనకు ఎంతో ఇష్టమని తెలిపారు. ఈ అవార్డు దక్కటం చాలా సంతోషంగా ఉందని అన్నారు. అవార్డు రావడంపై రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకట రామణరావు, మోపిదేవి విజయనిర్మల వెంకట హరినాథ్ బాబు, జడ్పిటిసి నర్రా సుబ్బయ్య, సొసైటీ ప్రెసిడెంట్ మరక శ్రీనివాసరావు, మాజీ జడ్పిటిసి పి వాసుదేవరావు, జీడీసీసీ చైర్మన్ మదన్ మోహన్ భాగ్యలక్ష్మి అభినందనలు తెలిపారు.



అవార్డు అందుకుంటున్న శ్రీనివాసరావు

వసతిగృహం గదులకు తలుపుల్లేవు..

డోర్లు విరిగి పోయి శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు

ప్రజాశక్తి - సంతమాగులూరు

స్థానిక సాంఘిక సంక్షేమ శాఖ ఎస్సీ హాస్టల్‌లోని విద్యార్థులు రెండేళ్లుగా సమస్యలతో సతమతం అవుతున్నారు. ఈ హాస్టల్‌లో ఈ ఏడాది 3వ తరగతి నుండి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులు 70మంది ఉన్నారు. హాస్టల్‌లో 15మరుగుదొడ్లు, నాలుగు బాత్రూం గదులు ఉన్నాయి. మరుగు దొడ్లకున్న తలుపులు విరిగిపోయాయి. మరుగుదొడ్లను శుభ్రం చేసేవారు లేక దుర్వాసన వెదజల్లుతున్నాయి. విద్యార్థులున్నా మరుగుదొడ్లను ఉపయోగించుకోలేక హాస్టల్ బయట ఉన్న పొలాలలోకి వెలుతున్నారు. ఇక వసతి గృహంలోని తలుపులు, కిటికీలు శిథిలావస్థకు చేరి విరిగిపోయాయి. గదులలోని విద్యుత్ స్విచ్ బోర్డులు ఊడిపోయి వేలాడుతున్నాయి. గదులలో ఉన్న ఫ్యాన్లు రిపేరుకు గురై తిరగడంలేదు. వసతి గృహానికి తలుపులు లేనందున రాత్రులందు చలికి ఇబ్బందులు పడుతున్నారు. దోమకాటుకు గురవుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల జరిగిన మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశంలో కూడా హాస్టల్ వార్డెన్ బి ఫ్రాంక్లీన్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి హాస్టల్‌లో నెలకొని ఉన్న సమస్యలపై దృష్టి పెట్టాలని విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.



ఎస్‌సి హాస్టల్‌లో తలుపులు లేని మరుగుదొడ్లు



భగత్‌సింగ్‌కు నివాళి అర్పిస్తున్న నేతలు

భగత్ సింగ్ జయంతి

ప్రజాశక్తి - బాపట్ల

పిన్నవయసులోనే దేశం కోసం తృణప్రాయంగా ప్రాణాలు త్యజించిన వేగుచుక్క భగత్ సింగ్ అని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి పిసి సాయి బాబు అన్నారు. భగత్ సింగ్ 116వ జయంతి సందర్భంగా ఫోరం ఆధ్వర్యంలో మండల కార్యాలయం వద్ద గల భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి గురువారం నివాళులర్పించారు. చిరునవ్వుతో ఉరికంబం ఎక్కిన ఆయన త్యాగం నిరుపమానమైనదని అన్నారు. జ్వలించే నిప్పు ఖనిక లా తెల్ల దొరలను వణికించారని అన్నారు. దేశ స్వాతంత్రాన్నే కాకుండా సమసమాజంలో అసమానతలు, మూఢనమ్మకాలు లేని దేశం కోసం కలలు కన్నారని అన్నారు. ఆయన ప్రాణ త్యాగం వల్ల దేశ ప్రజల్లో స్వాతంత్ర్య కాంక్ష రగిలిందని అన్నారు. భగత్ సింగ్ ఆశయాల కోసం పాటుపడాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాది జడ్ బాషా, సుభాని, రెడ్డి రహేల్ పాల్గొన్నారు.

2న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అక్టోబరు 2న ఇంకొల్లులో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు కరి కమలేశ్వరరావు, జెట్టి వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక బాలికోన్నత పాఠశాల ఆవరణలో ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 1గంట వరకు శిబిరం జరుగుతుందని తెలిపారు. పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బస్‌స్టాప్ ఏర్పాటు చేయాలని వినతి

ప్రజాశక్తి - సంతమాగులూరు

మండలంలోని అడ్డరోడ్డు జంక్షన్ నందు లగ్జరీ, హైటెక్ ఆర్టీసీ బస్సులకు బస్టాపు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ జంక్షన్ గుండా హైదరాబాద్, ఒంగోలు, నెల్లూరు, చెన్నై, గుంటూరు, విజయవాడ, కర్నూలు, అనంతపురం, తెలంగాణ, ఆంధ్ర లగ్జరీ, హైటెక్ ఆర్టీసీ బస్సులు తిరుగుతుంటాయి. ప్రతిరోజు 200మందికి పైగా అధిక చార్జీలు చెల్లిస్తూ ప్రయాణిస్తున్నారు. అడ్డ రోడ్డు జంక్షన్ నుండి హైదరాబాద్ వెళ్లడానికి, అద్దంకి నుండి టికెట్ డబ్బులు వసూలు చేస్తున్నారు. అలాగే ఈ జంక్షన్ నుండి కర్నూలు వైపు వెళ్లడానికి నరసరావుపేట నుండి టికెట్ ధర చెల్లించాల్సి వస్తుంది. హైదరాబాదు నుండి అడ్డరోడ్ జంక్షన్ చేరుకోవడానికి అద్దంకి స్టేజికి టికెట్ డబ్బులు చెల్లించాల్సి వస్తుందని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఆర్టీసీ అధికారులు స్పందించి లగ్జరీ, హైటెక్ బస్సులకు స్టేజి కేటాయించాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జనసైనికుడు ఆదిశేషు

వికలాంగులు ఓట్లు సరిచూసుకోవాలి

ప్రజాశక్తి - బాపట్ల రూరల్

దివ్యాంగులు తమ ఓట్లు సరిచూసుకోవాలనీ బాపట్ల జనసేన దివ్యాంగుల జనసైనికుడు గోగన ఆదిశేషు అన్నారు. స్థానిక జనసేన కార్యాలయంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దివ్యాంగులు తమ ఓట్లను స్థానిక తహశీల్దారు కార్యాలయం, సచివాలయంలో పరిశీలించుకావాలని సూచించారు. ఒట్లు లేని ఎడల వెంటనే చేర్చుకొని 2024లో జరగబోవు సాధారణ ఎన్నికలలో దివ్యాంగుల ఓట్లను బలమైన శక్తిగా చేసుకోవాలన్నారు. మన ఓట్లతో గెలిచి మనల్ని గుర్తించని ప్రభుత్వానికి మన ఓటుతో సరైన బుద్ధి చెప్పాలని అన్నారు. కంది వెంకటరెడ్డి, గంట నాగమల్లేశ్వరరావు, దేవరెడ్డి శ్రీనివాసరావు, వీర్రాజు పాల్గొన్నారు.



హెచ్‌ఎం పిడపర్తి పేరిరెడ్డిని అభినందిస్తున్న ఎంపి సురేష్

పేరిరెడ్డికి ఎంపీ నందిగం అభినందన

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

మండలంలోని ఇడుపులపాడు విద్యాపరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పిడపర్తి పేరిరెడ్డి విద్యారంగంలో సేవలు మరింత విసృతం చేయాలని బాపట్ల ఎంపి నందిగం సురేష్ కొనియాడారు. హెచ్‌ఎంల విభాగంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన పేరిరెడ్డిని సత్కరించారు. విద్యారంగానికి, ఎన్సీసీకి చేసిన సేవలను గుర్తించటం, మీ కార్యదీక్ష, పట్టుదల, నిరంతర కృషికి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు ప్రధానం చేయడం చాలా అభినందనీయమని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి అవార్డులు మరిన్ని పొందాలని ఆకాంక్షించారు.

జానపద నృత్యానికి ప్రథమ బహుమతి

ప్రజాశక్తి - ఇంకొల్లు రూరల్

మండలంలోని గంగవరం శ్రీ వలేటి కృష్ణయ్య ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థిని జవ్వాది మాన్యతకి జానపద నృత్యానికి జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం లభించింది. ఎపి ప్రభుత్వం యువజన సర్వీసుల శాఖ బాపట్ల వ్యవసాయ కళాక్షేత్రంలో నిర్వహించిన పోటీల్లో మాన్యతకు బహుమతి దక్కింది. యువజన శాఖ స్టెప్ 1అధికారి ఎస్ పల్లవి, జిల్లా సైన్స్ అధికారి షాదిక్ చేతుల మీదుగా మాన్యత బహుమతి అందుకుంది. ఈ సందర్భంగా మాన్యతను, టీచర్ సుమలతను, హెచ్‌ఎం కె వీరాంజనేయులు, ఉపాధ్యాయులు, సిబ్బంది అభినందించారు.

ప్రభుత్వ లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు

ప్రజాశక్తి-భట్టిప్రోలు

మండలంలోని పల్లెకోన గ్రామంలో ఆర్మీ జవాన్ గోపరాజు మృతదేహానికి ప్రభుత్వ లాంఛనాల మధ్య అంత్యక్రియలు గురువారం ఘనంగా నిర్వహించారు. సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మెరుగు నాగార్జున, బాపట్ల ఎంపీ నందిగం సురేష్ జవాన్ గోపరాజు పార్థివ దేహానికి పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. నిరుపేద కుటుంబంలో జన్మించిన గోపరాజు దేశ రక్షణ కోసం విధులలో చేరి డ్యూటీలో ఉండగా మతి చెందటం బాధాకరమని మంత్రి నాగార్జున, రాజ్యసభ సభ్యులు మోపిదేవి వెంకటరమణారావు అన్నారు. ఆయన కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో రేపల్లె ఆర్డీవో జగన్నాథం పార్థ సారథి, తహశీల్దారు డి వెంకటేశ్వరరావు, సర్పంచ్ రాజమ్మ, ప్రతాప్ రాజు, నాయకులు సేరు శ్రీనివాసరావు, పలువురు ఆర్మీ అధికారులు, గ్రామస్తులు పెద్దలు పాల్గొన్నారు.



హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేస్తున్న అధికారులు

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

'ప్రజాశక్తి' వార్తకు స్పందన

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం పట్టణ సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో సర్వేనెంబర్ 28/2 లోని లక్షల ఖరీదు చేసే ప్రభుత్వ భూమిని ఓ వ్యక్తి ఆక్రమించుకున్నాడు. దీనిపై ప్రజాశక్తి మినీలో గురువారం నాడు ప్రభుత్వ భూమి కబ్జా వెలువడింది. దీనిపై రెవిన్యూ అధికారులు స్పందించారు. ఆ స్థలంలో అక్రమ కట్టడాలు తొలగించారు. హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. ఇన్చార్జ్ తాసిల్దార్ షేక్ పర్వీన్, సిబ్బంది పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న ఎమ్మెల్యే స్వామి

జగన్‌కు ఓటమి భయం ..

కొండపి ఎమ్మెల్యే స్వామి

ప్రజాశక్తి-కొండపి

'వచ్చే ఎన్నికల్లో జనం జగన్ సర్కారుకు గుణపాఠం చెప్పనున్నారు. ఏ ముహర్తాన ప్రజావేదిక కూలగొట్టి అశు భయంతో పాలన మొదలెట్టారో... అప్పటి నుంచి కూల్చుడే కూల్చుడు. ఒక్క సాగునీటి ప్రాజెక్టు కట్టిందిలేదు, పరిశ్రమలు లేవు, ఇనుమంత కూడా అభివృద్ధి లేదు. ఓటమి తప్పదని గ్రహించి టిడిపి అధినేత చంద్రబాబును అక్రమ కేసులో జగన్ జైలులో పెట్టారు' అని కొండపి శాసన సభ్యులు డాక్టర్ డోలా శ్రీ బాలవీరాంజనేయస్వామి ఆరోపించారు. చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసగా చేపట్టిన రిలే దీక్షలు గురువారం ముస్లిం మైనారిటి సోదరులతో కొనసాగాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ జగన్‌పాలనంతా అసలు అభివృద్ధి లేదని, పథకాల ఆర్థిక బారాన్ని తగ్గించుకునేందుకు లబ్ధిదారులను కుదించారని అన్నారు. ప్రతియోటా జాబ్‌క్యాలెండర్ అని ఆర్భాటంగా హామీ ఇచ్చి చేతులెత్తేశారన్నారు. దీంతో ఉపాధి లేక నిరుద్యోగులు పక్క రాష్ట్రాలకు పోతున్నారని, ఉద్యోగుల పరిస్థితి కూడా దయనీయంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జి.రామయ్యచౌదరి, మండల యూత్ అధ్యక్షులు ఖాలేషా, తిప్పారెడ్డి కృష్ణారెడ్డి, వై.పెద్దోడు, కొండపి నాయకులు బి.సోమయ్య, నన్నూరి సుబ్బరామయ్య, మండలంలోని ముస్లిం సోదరులు, నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

క్రెడిట్ కార్డు మోసాల పట్ల జాగ్రత్త

- అనధికార యాప్స్ డౌన్‌లోడ్ వద్దు..
- ఎస్‌పి మలికగర్గ్

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

మీ క్రెడిట్ కార్డుపై ఛార్జెస్ పడతాయని లేదా బ్లాక్ అవుతుందని చెప్తూ వచ్చే ఫోన్ కాల్స్, లింక్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ మల్లికగర్గ్ సూచించారు. ఇటీవల ఐసిఐసిఐ క్రెడిట్ కార్డు కల్గి ఉన్న మద్దిపాడు మండలానికి చెందిన ఒక వ్యక్తికి సైబర్ నేరగాళ్లు ఒక నెంబర్ నుండి ఫోన్ చేసి మీ ఐసిఐసిఐ క్రెడిట్ కార్డు చార్జెస్ పడతాయని, ఆ చార్జెస్ పడకుండా ఉండుటకు అతని వాట్సప్ నెంబర్‌కు "ఐసిఐసిఐ బ్యాంక్ క్రెడిట్ కార్డు. ఏపీకే" యాప్ పంపించి అది అతని ఫోన్లో డౌన్లోడ్ చేయించి అతని ఫోన్ హ్యాక్ చేశారని, అతని కార్డు డీటెయిల్స్‌ను నమోదు చేయాలని చెప్పి ఆ డీటెయిల్స్‌ను నమోదు చేసిన వెంటనే అతని క్రెడిట్ కార్డు నుండి రూ.98 వేలు కట్ అయ్యి మోసపోయాడని చెప్పారు. ఏదైనా యూపీఐ యాప్, క్రెడిట్/డెబిట్ కార్డు లేదా ఇతర పేమెంట్స్‌కు సంబంధించిన యాప్స్‌ను గూగుల్ ప్లే స్టోర్/యాపిల్ స్టోర్ నుంచి అధీకత వెబ్సైట్లలో మాత్రమే డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు. గుర్తుతెలియని వారి నుంచి



వెరిఫై గానీ, లింక్‌లపై క్లిక్ చెయ్యడం ద్వారా ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజీ ఫైల్స్ డౌన్‌లోడ్ చేసుకోవద్దని సూచించారు.

పాటించాల్సిన జాగ్రత్తలు

- మీకు ఎవరైనా గుర్తుతెలియని వ్యక్తులు ఫోన్ చేసి మీ క్రెడిట్ కార్డుపై చార్జెస్ పడతాయని లేదా బ్లాక్ అవుతుందని చెప్తూ అలా జరగకుండా మేము పంపే లింక్ పంపితే వాటిని నమ్మి క్లిక్ చేయకండి.
- మీ క్రెడిట్/డెబిట్ కార్డ్/బ్యాంక్ ఖాతా నంబర్, కార్డ్ వెరిఫికేషన్ వాల్యూ (సీవీవీ) నంబర్, ఎక్సపైరీ డేట్ మొదలైన వ్యక్తిగత సమాచారాన్ని ఫోన్ కాల్ లో కానీ, అన్ వెరిఫైయిడ్ లింక్స్ ద్వారా ఓపెన్ చేసిన యాప్స్/వెబ్ సైట్లలో పంచుకోవద్దు.
- మీ కేవైసీ వంటివి అప్‌డేట్ చేయడానికి ఎలాంటి థర్డ్ పార్టీ యాప్ చేసుకోవవ్వదు. బ్యాంకులు/ఫైనాన్సియల్/టెలికం సంస్థలు అలాంటి థర్డ్ పార్టీ యాప్ డౌన్‌లోడ్ చేసుకోమని ఎన్నడూ అడగవనే విషయాన్నీ గ్రహించండి.
- ఎవరైనా వినియోగదారులను కాల్ సెంటర్ వారు బ్యాంకు అకౌంట్ వివరాలు, లాగిన్ ఐడీలు, పాస్‌వర్డ్ లు, పిన్, ఓటీపీలు అడిగితే ఎట్టి పరిస్థితిలోనూ చెప్పరాదు, ఏ బ్యాంకులు/సంస్థలు ఎప్పుడూ ఆ వివరాలను అడగవు.
- ఎవరైనా ఈ తరహా సైబర్ నేరంకు గురైతే వెంటనే సైబర్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు కాల్ చెయ్యండి లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌లో ఫిర్యాదు చెయ్యాలని ఎస్పీ ప్రజలకు సూచించారు.

సామాజిక చైతన్య ఉద్యమకారుడు జాషువా

సంయుక్త కలెక్టర్ శ్రీధర్

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

మహాకవి గుర్రం జాషువా గొప్ప సామాజిక చైతన్య ఉద్యమకారుడిగా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోయారని జిల్లా సంయుక్త కలెక్టర్ చామకూరి శ్రీధర్ అన్నారు. గుర్రం జాషువా 128వ జయంతి కార్యక్రమం గురువారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. గుర్రం జాషువా చిత్రపటానికి జాయింట్ కలెక్టర్ శ్రీధర్ పూలమాల వేసి.. ఘనంగా నివాళులర్పించారు. జేసీ మాట్లాడుతూ అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం ఎన్నో రచనలతో ప్రజల ఆలోచనలలో మార్పు తెచ్చారని వివరించారు. జాషువా జయంతిని ప్రభుత్వ కార్యక్రమంగా జరపాలని ఉత్తర్వులు వెలువడ్డాయన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని ప్రజలంతా ఐకమత్యంతో మెలగాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ సంక్షేమ సాధికారత అధికారి జె.రాజదిబోర, కలెక్టరేట్ ఏవో గోపికష్ణ, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.



జాషువా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న జేసీ శ్రీధర్

మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు ఉధృతి


- దిగుబడులపై తీవ్ర ప్రతికూల ప్రభావం
- ఆందోళనలో కర్షకులు

ప్రజాశక్తి-త్రిపురాంతకం

గత మూడు నాలుగేళ్లుగా మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు వ్యాప్తి చెంది తీవ్రమైన నష్టాలు వచ్చాయి. అయితే గత ఏడాది కత్తెర పురుగును నివారించి అధిక దిగుబడి లభించింది. ఈ అనుభవం దష్ట్యా ఈ ఏడాది ఆరుతడి పంటల సాగుకు ముందుకు రావాలని సూచించిన నేపథ్యంలో త్రిపురాంతకం మండలంలో రైతులు మొక్కజొన్న వైపు మొగ్గు చూపుతున్నారు. 700 ఎకరాల్లో సాగు చేశారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది మొక్కజొన్న పైరులో కత్తెర పురుగు ఉధృతి ఎక్కువగా ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమగ్రమైన యాజమాన్య చర్యలను పాటించినప్పటికీ కత్తెర పురుగును పూర్తిగా నియంత్రించేందుకు అవకాశం ఉంటుందని, ఇందులో ప్రధానంగా విత్తనశుద్ధి తప్పనిసరి అని సూచిస్తున్నారు. ఆఫ్రికా దేశాలలో పుట్టి పంటలకు తీవ్ర నష్టం కలిగించిన లెపిడప్టరస్ జాతికి చెందిన కత్తెర పురుగు భారతదేశంలో 2018లో తొలిసారిగా కర్ణాటక రాష్ట్రంలో మొక్కజొన్న పైరుపై దాడి చేసిందని ఆ తర్వాత తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ తమిళనాడు, ఒరిస్సా రాష్ట్రాలకు కూడా వ్యాపించిందని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెబుతున్నారు. కత్తెర పురుగును నియంత్రించేందుకు కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ ప్రత్యేక దష్టి సారించి రైతులు అప్రమత్తం చేస్తున్నప్పటికీ కత్తెర పురుగును అదుపు చేయడంలో వైఫల్యం చెందినట్లు రైతులు చెబుతున్నారు. మొక్కజొన్న సాగుకు సంబంధించి విత్తన శుద్ధి మొదలుకొని పంట చేతికి వచ్చేవరకు సస్యరక్షణ చర్యలు పాటించాలని భారతీయ వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

సూచనలు తప్పక పాటించాలి..

మొక్కజొన్న పంటను సాగు చేసే రైతులు కత్తెర పురుగు ఉధతిపై తొలి నుండి జాగ్రత్తలు పాటించాలి. వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచించిన ప్రకారం విత్తన శుద్ధి తప్పనిసరిగా చేయించుకోవాలి. పంట చేతికి వచ్చే వరకు అప్రమత్తంగా ఉండి సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. కత్తెర పురుగు నివారణ చర్యలపై ఇప్పటికే రైతులకు అన్ని



ఎండిపోతున్న మొక్కజొన్న పంట

విధాలుగా అవగాహన కల్పించామని, నివారణ పద్ధతులు పాటిస్తే కత్తెర పురుగును నియంత్రించే అధిక దిగుబడులు పొందవచ్చని చెబుతున్నారు. కత్తెర పురుగు నియంత్రణకు తొలి నుండి జాగ్రత్తలు పాటించాలి. ఇందుకోసం ఇమిడాక్లోబ్రిడ్ 1 కేజీ విత్తనానికి 0.6 గ్రాములతో విత్తన శుద్ధి చేసుకోవాలి. విత్తన శుద్ధి చేయడం వలన మొలక తర్వాత 21 రోజుల లోపు కత్తెర ఇతర చీడలు పురుగు ఉధతిని నియంత్రించేందుకు అవకాశం ఉంటుంది. విత్తనం వేసిన వారం లోపు లీటర్ నీటికి 0.5 ఎంఎల్ వేపనూనె పంటపై పిచికారి చేస్తే కత్తెర పురుగు లార్వా దశలోనే నిర్మూలించేందుకు అవకాశం ఉంటుంది. పంట పెరిగే కొద్ది ఎప్పటికప్పుడు అప్రమత్తంగా వ్యవహరించాలి. కత్తెర పురుగు ఆశించినట్లయితే లీటరు నీటిలో 0.5 గ్రాముల హిమామెక్టిన్సెంజెట్ మందును పిచికారి చేయడం వలన ఉధతిని నివారించవచ్చు. పంట 30 రోజుల వయసులో ఉన్నప్పుడు ఎకరాకు 10 లింగాకర్షణ బుట్టలు ఏర్పాటు చేయడం ద్వారా కత్తెర పురుగు నియంత్రణకు ఉపయోగపడుతుంది.



మొక్కజొన్న పంటపై పురుగు

మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి

బొడ్డు మల్లిఖార్జున, రైతు, కొత్త అన్నసముద్రం, త్రిపురాంతకం

ఈ ఏడాది మొక్క.జొన్న పంటను రెండు ఎకరాల్లో సాగు చేశారు. పంటను కంటికి రెప్పలా కాపాడుకున్నాను. అయితే కత్తెర పురుగు సోకడంతో మొక్కల ఆకులు కొరుక్కు తింటున్నాయి. మొక్కలు ఎండిపోతున్నాయి. రూ. 60 వేలు పెట్టుబడి పెట్టాను. ఈ ఏడాది పెట్టుబడులు తీరే అవకాశం కూడా కనిపించడం లేదు. నష్టపోయిన మొక్కజొన్న రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి.